



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 101 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం | 21 | డిసెంబర్ | 2024 | పేజీలు : 12 | వెల : 2/-


## బీజేపీని వణికించిన
# శీతాకాల సమావేశం



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిరవధికంగా శుక్రవారం వాయిదా పడ్డాయి. నవంబర్ 25 నుంచి ప్రారంభమైన ఈ సమావేశాలో బీజేపీ అనుకున్న విధంగా బిల్లులను అయితే పాస్ చేయించుకోలేక పోయింది అని అంటున్నారు. జమిలి ఎన్నికల బిల్లుని ఇదే పార్లమెంట్ లో చర్చకు పెట్టి ఆమోదించుకోవాలని అనుకున్నా విపక్షాల వ్యతిరేకత మధ్యన చివరిలోనే దానిని ప్రవేశపెట్టి జాయింట్ యాక్షన్ కమిటీ ముందుకు పంపించారు. అదే విధంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు చట్టం అవుతుందని శీతాకాల సమావేశాలే దానికి ముహూర్తం అని ప్రచారం సాగినా జేపీసీకి మరో మూడు నెలలు గడువు ఇచ్చి దీని మీద మిగతా 2లో..

## మందిర్ - మసీదు
# వివాదాలు ఆగేదెప్పుడు?

### ఆర్ఎస్ఎస్ చీఫ్ ఆవేదన



**ముంబై :** దేశంలో మందిర్ - మసీద్ వివాదాలపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని పుణేలో జరిగిన ఓ కార్యక్రమంలో 'విశ్వగురు భారత్' అనే అంశంపై మోహన్ భగవత్ మాట్లాడారు. అయోధ్య రామాలయం నిర్మాణం తర్వాత మందిర్ - మసీదు వివాదాలు రోజురోజు ఎక్కువవుతున్నాయని, ఇలాంటి వివాదాలు లేవనెత్తడం ద్వారా తాము హిందూ నాయకులుగా చలామణి అవ్వొచ్చని కొందరు భావిస్తున్నారని మండిపడ్డారు మోహన్ భగవత్. మన దేశంలో పౌరులు సామరస్యంతో కలిసిమెలిసి జీవించగలరి ప్రపంచానికి చూపించాల్సిన అవసరం ఉందని అన్నారు మోహన్ భగవత్. భారతీయ సమాజం భిన్నత్వంలో ఏకత్వంతో జీవిస్తుందని గుర్తు చేశారు. రామకిష్ణ మఠంలో క్రిస్మస్ జరుపుతామని, మనం హిందువులం కాబట్టే అలా చేయగలమని చెప్పారు. 'దేశంలో సామరస్యంగా జీవిస్తున్నాం. ఈ మిగతా 2లో..

# క్రైమ్ బ్రాంచ్‌కి రాహుల్ కేసు



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై నమోదైన కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం జరిగిన తోపులాట ఘటనకు సంబంధించి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై నమోదైన కేసు ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యింది. బీజేపీ ఎంపీల ఫిర్యాదు మేరకు పోలీసులు రాహుల్ గాంధీపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలకు గాయాలు కావడానికి రాహుల్ గాంధీనే కారణమని ఆరోపిస్తూ బీజేపీ ఎంపీలు హేమంగ్ జోషి, అనురాగ్ ఠాకూర్, బాన్సురీ స్వరాజ్ పార్లమెంట్ స్ట్రీట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద రాహుల్‌పై కేసు నమోదైంది. మరోవైపు, బీజేపీపై కాంగ్రెస్ ఎంపీలు చేసిన ఫిర్యాదుపైనా ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేపట్టనున్నారు. కాగా, పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం ఉదయం బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మధ్య తోపులాట చోటు చేసుకోవడంతో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకున్న విషయం తెలిసిందే. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. మరోవైపు, అంబేద్కర్‌ను అవమానించింది కాంగ్రెస్ పార్టీనే అంటూ అధికార బీజేపీకి చెందిన సభ్యులు కూడా నిరసనలకు దిగారు. ఇరువర్గాల పోటాపోటీ మిగతా 2లో..



# ఉచిత బస్సు అమలుపై ఎందుకు జాప్యం!

**ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తామని చెప్పిన సూపర్ సిక్స్ అమలు పైన ఫోకస్ చేసింది. ఇప్పటికే పెన్షన్ రూ 4వేల కు పెంపుతో పాటుగా.. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తోంది. ఇక.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు పైన కొంత కాలంగా కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే ప్రభుత్వానికి ఆర్టీసీ అధికారులు నివేదిక ఇచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం ఈ పథకం అమలు పైన తాజా ప్రకటన చేసింది.**

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**

ప్రభుత్వం కసరత్తు ఏపీలో మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకం అమలు దిశగా ఆర్టీసీ అధికారుల నుంచి నివేదిక కోరారు. తెలంగాణ, కర్ణాటకలో పర్యటించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు అక్కడ అమలు అవుతున్న ఈ పథకం గురించి పూర్తి సమాచారం సేకరించారు. ఈ పథకం అమలు కారణంగా రాష్ట్ర ప్రభుత్వం పైన పడే ఆర్థిక భారం.. లోటు భర్తీ, మహిళలకు అమలు చేయటం ద్వారా పురుష ల అభిప్రాయాలు.. ఆటో వాలా నుంచి వస్తున్న అభ్యంతరాల గురించి చర్చించారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణం కల్పిస్తామని కూటమి మిగతా 2లో..



## మన్యంలో ప్రకృతి ప్రేమికుడి
# కాలి నడక

**పార్వతీపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** నిత్యం రద్దీగా ఉండే రోడ్లు.. కాలుష్యంతో నిండి ఉండే వాతావరణం.. ఎప్పుడూ హడావిడి జీవితం.. ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగం.. ఇవన్నీ పట్టణాల్లో బ్రతికే ప్రతీ మనిషి దైనందిన జీవితంలో భాగాలు! వీటికి జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అతీతులు కాదనే అంటారు. రాజకీయాల్లో అయినా, సినిమా షూటింగుల్లో అయినా ఇవన్ని మామూలే! సహజంగా ప్రకృతి, జంతు ప్రేమికులైన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తాజాగా మన్యం పార్వతీపురం జిల్లాలో పర్యటించారు. ఈ సమయంలో కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆయన కాన్వాయ్ సాగుతుంటుంది. మరోపక్క చుట్టూ కొండలు, లోయలు కనిపిస్తున్నాయి. పచ్చికబయళ్లు మిగతా 2లో..

# ఏపీలో ఇన్నోవేషన్ వర్సిటీ

### ఫిజిక్స్ వాలాతో కీలక ఒప్పందం..!



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఏపీని ఆవిష్కరణల కేంద్రంగా మార్చడంతో పాటు ఉన్నత విద్యను ఆధునీకీకరించే లక్ష్యంతో ప్రభుత్వం ఇవాళ రెండు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఎడ్యుటెక్ ఫ్లాట్ ఫామ్ అయిన ఫిజిక్స్ వాలాతో పాటు టోనీబ్లెయిర్ ఇన్ స్టిట్యూట్ (టీబీఐ)తోనూ ఈ ఒప్పందాలు జరిగాయి. ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో అధికారులు ఆయా సంస్థల ప్రతినిధులతో ఈ ఒప్పందాలు చేసుకున్నారు. ఫిజిక్స్ వాలా ఎడ్యుటెక్ సంస్థ తన పరిశ్రమ భాగస్వామి అయిన అమెజాన్ వెబ్ తో కలిసి రాష్ట్రంలో ఏఐ-ఫోకస్డ్ ఫస్ట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ (ఐఓఈ) యూనివర్సిటీ ఆఫ్ ఇన్నొవేషన్ (యుఓఐ)ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం చేసుకుంది. మరోవైపు ఏపీలో ఉన్నత విద్యను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్‌తో మరో మిగతా 2లో..

# కాకినాడ పోర్టులో భారీ ట్విస్ట్‌లు

### పుదుచ్చేరి సహా 6 రాష్ట్రాల దందా!



**కాకినాడ, విశ్వంవాయిస్ న్యూస్ :**

ఏపీలోని కాకినాడ పోర్టులో రేషన్ బియ్యం పట్టుకునేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేరుగా రంగంలోకి దిగిన తర్వాత కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పవన్ టూర్, రేషన్ బియ్యం ఎగుమతులపై కన్నెర్ర చేసిన తర్వాత అధికారులు రంగంలోకి మిగతా 2లో..






## కాంగ్రెస్‌తో జగన్‌కి
# మైత్రి బలపడుతుందా?



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** జగన్ కాంగ్రెస్ లోనే పుట్టి పెరిగారు. ఆయన ఇంట్లో ఒంట్లో కూడా కాంగ్రెస్ రక్తం ఉంది. అపుడెపుడో చంద్రబాబు ఉమ్మడి ఏపీ అసెంబ్లీలో మాట్లాడుతూ తన రక్తంలో ముప్పయి శాతం కాంగ్రెస్ బ్లడ్ ఉందని చెప్పినట్లుగా ప్రచారంలో ఉంది. మరి జగన్ రక్తంలో కాంగ్రెస్ బ్లడ్ ఎంత అంటే చాలానే అని చెప్పాలి. జగన్ 2009లో కాంగ్రెస్ ఎంపీ కావచ్చు. కానీ ఆయన మిగతా 2లో..

# ఎడిటర్ వాయిస్

## జమిలి' నిరంకుశం!

అన్నివైపుల నుండి వ్యతిరేకత వస్తున్నా రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' లక్ష్యంగా రూపొందించిన వివాదాస్పద జమిలి (రాజ్యాంగ సవరణ) బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందని, ప్రజాస్వామ్య స్వరూపంపైన, సమాఖ్యవాదంపైన దాడిగా దీనిని అభివర్ణించడం సరైనదే! రాష్ట్ర అసెంబ్లీ పదవీ కాలాన్ని కేంద్ర పదవీ కాలంలోకి మార్చడం రాజ్యాంగానికి ద్రోహం చేయడమేనని విమర్శించాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, అలాగే లోక్‌సభ ఎన్నికలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ విషయమై ఓటింగ్ కోరగా 269 మంది సభ్యులు రాజ్యాంగ సవరణ బిల్లును సమర్పించడానికి మద్దతు ఇవ్వగా 198 మంది సభ్యులు వ్యతిరేకించారు. బిల్లు అంతిమంగా నెగ్గడానికి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. కానీ ఆ పరిస్థితి లేకపోయినా మోడీ ప్రభుత్వం బిల్లును బుల్డోజ్ చేయడం నిరంకుశ పోకడలకు నిదర్శనం. ఏమైనప్పటికీ ప్రజెంటేషన్ దశలోనే తీవ్ర వ్యతిరేకత రావడంతో బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపక తప్పలేదు.

సమగ్ర అధ్యయనం, విస్తృత చర్చల తర్వాతే బిల్లు తీసుకొచ్చామని, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని మంత్రి మేఘ్వాల్ లోక్‌సభకు సుతిమెత్తగా వివరించారు. కానీ, 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనే భావన రాజ్యాంగంలోని ఫెడరలిజంతో సహా దాని మౌలిక స్వరూపానికి విరుద్ధం. 'బిల్లులోని నిబంధనలు శాసన వ్యవస్థ అధికార పరిధిని ఉల్లంఘించేవిగా ఉన్నాయి. లోక్‌సభ పదవీకాలం ప్రకారం శాసన సభల పదవీకాలం నిర్ణయించబడదు. చట్టసభలు విడివిడిగా ఉంటాయి. ఈ బిల్లుతో అధిక కేంద్రీకరణ అమలులోకి వస్తుంది. సభల కాలవ్యవధి, ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే అధికారాలను ఎన్నికల కమిషన్‌కే వదిలేస్తున్నారు. అలా అయితే ఒక వ్యక్తి కోరిక నెరవేర్చడం కోసమే ఈ బిల్లులను పెట్టినట్లు ఉంటుంది' అన్న ప్రతిపక్ష ఎంపీల విమర్శ అక్షర సత్యం. ఈ బిల్లుతో దేశ గణతంత్ర రాజ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ%% రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినవని, కానీ ఈ బిల్లుతో ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ పెత్తనం కిందికి వెళ్లిపోతాయన్న సిపిఎం ఎంపి అమ్రా రామ్ ఆందోళన ఈ దేశంలోని ప్రజాస్వామ్య ప్రియులందరిదీను. దేశంలో ఒక్కో రాష్ట్రం ఒక్కో రకమైన భాష, తమదైన అధికార వికేంద్రీకరణ కలిగి ఉన్నాయి. వాటిపై రాష్ట్రాలకు గల హక్కును కేంద్రం ఎలా లాక్కొంటుంది? కానీ ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రాంతీయ పార్టీలు మూడూ ఈ బిల్లును సమర్థించడం ఆత్మహత్యా సదృశం. జమిలి ఎన్నికల వల్ల ఎన్నికల వ్యయం తగ్గుతుందన్న మాట సర్వాబద్ధం. మోడీ సర్కారుకు ఊపిరి పోస్తూ ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న జెడియు నుంచి ఎవరూ బిల్లుకు మద్దతుగా మాట్లాడకపోవడం గమనార్హం.

ప్రస్తుతానికి పక్కన పెట్టినా పంచాయతీలు, స్థానిక సంస్థల ప్రాథమిక సూత్రమైన వికేంద్రీకరణ స్ఫూర్తికే పూర్తి విరుద్ధమైనది. కీలకమైన 'స్థానికత' మాయమవుతుంది కదా! గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం అవగాహనకే ఇది విఘాతం. గత 75 ఏళ్లలో ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయో, పార్లమెంట్, శాసనసభలు ఎలా ఏర్పడ్డాయో మనం చూశాం. స్థానిక సంస్థలకు, వాటికి నిధులు, విధులు, అధికారాల కల్పనకూ సాగిన ఉద్యమాలు, చేసిన పాలనా సంస్కరణలు చరిత్రలో చాలా ఉన్నాయి. వాటన్నిటికీ పాతర వేసే ఈ జమిలి ఎన్నికల ప్రతిపాదనతో దేశంలో కేంద్రీకృత నిరంకుశ రాజకీయ వ్యవస్థ నెలకొంటుంది. అది ఏక పార్టీ పాలనకూ ఆ తరువాత ఏక వ్యక్తి నియంతృత్వానికి దారి తీసే ప్రమాదం వస్తుంది. నిరంకుశమైన జమిలి ఎన్నికల ప్రతిపాదనను అన్ని ప్రజాస్వామ్య సంస్థలు, యావత్ దేశ ప్రజలు ఐక్యంగా వ్యతిరేకించాలి. భారత రాజ్యాంగాన్ని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి.



ఎడిటర్ : క. సునీల్‌కుమార్

(మొదటిపేజీ తరువాయి)

### శీతాకాల సమావేశం

అధ్యయనాన్ని కొనసాగించడానికి వీలు కల్పించారు. ఇక పార్లమెంట్ లో రాజ్యాంగ ఆమోదించి 75 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా చర్చ మాత్రం సాగింది. అయితే ఇక్కడ కూడా అధికార బీజేపీ విపక్ష ఇండియా కూటముల మధ్య విమర్శల జోరే కనిపించింది. రాజ్యాంగాన్ని ఎవరు గౌరవించారు, ఎవరు అవమానించారు అన్న దాని మీద ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఇక చూస్తే కనుక శీతాకాల సమావేశాలు ప్రారంభం అవుతూనే అదానీ మీద చర్చలకు డిమాండ్ చేస్తూ సభను స్తంభింప చేసేందుకు విపక్షాలు చూస్తూ వచ్చాయి. దాంతో సభ ప్రతీ రోజూ దాదాపుగా వాయిదా పడుతూనే వస్తోంది. పని గంటలు కూడా గతంతో పోలిస్తే ఈసారి తగ్గాయని అంటున్నారు. ఈసారి పార్లమెంట్ లో రాహుల్ గాంధీ పెద్దగా ఫోకస్ కాలేదు. ప్రియాంకా గాంధీ మొదటిసారి ఎంపీగా నెగ్గి సభకు రావడంతో ఆమె తన ఉనికి బలంగా చాటుకున్నారు. ముఖ్యంగా రాజ్యాంగం మీద చర్చలో ప్రియాంకా గాంధీ మంచి స్పీచ్ ఇచ్చారని ప్రశంసలు వచ్చాయి. అదే విధంగా మోడీ ప్రభుత్వం మీద ఆమె ధీటైన విమర్శలు చేశారు అని కూడా అంటున్నారు. ప్రధాని మోడీ ఈ సారి సమావేశాలలో రాజ్యాంగం మీద చర్చలో కీలకమైన ప్రసంగం చేశారు. అయితే గత సమావేశాలతో పోల్చితే ఈసారి మోడీ మార్క్ అయితే అంతగా కనిపించలేదు అనే అంటున్నారు. ఈసారి మొత్తం సమావేశాలలో హైలెట్ ఏంటి అంటే బీజేపీలో ఎన్డీయేలో కీలకమైన బలమైన నేతగా ఉన్న అమిత్ షాను ఇరుకున పెట్టడం. ఆయన అంబేద్కర్ మీద చేసిన వ్యాఖ్యలు అంటూ విపక్షాలు సభ లోపలా బయటా కూడా ఆందోళనలు చేశాయి. బహుశా ఈ ఆందోళనలు శీతాకాలం సమావేశాలు పూర్తి అయినా మరింత కాలం కొనసాగే అవకాశాలు అయితే ఉండొచ్చు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఒకటి అయితే వేరేగా చిత్రీకరించింది మరోటి అని బీజేపీ నేతలు అంటున్నారు. ఏది ఏమైనా మోడీ తరువాత అంతటి లీడర్ అయిన అమిత్ షా పదేళ్ళ పార్లమెంటరీ అనుభవం లో తొలిసారి విపక్షాలకు ఇలా దొరికి ఇబ్బంది పడ్డారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఎన్డీయే ప్రభుత్వాన్ని అదానీ ఇష్యూతో మొదలెట్టి అంబేద్కర్ ఇష్యూ దాకా లాగి విపక్షం అయితే పటిష్టంగానే వ్యవహరించింది అని విశ్లేషిస్తున్నారు. ఈసారి సమావేశాలలో అయితే బీజేపీ అనుకున్నది సాధించలేకపోయిందా అన్న చర్చ సాగుతోంది. విపక్షం మాత్రం తాము అదానీకి మోడీ సర్కార్ కి అండగా ఉందని ఎస్టాబ్లిష్ చేయగలిగామని అలాగే అంబేద్కర్ విషయంలో బీజేపీ మనువాద ధోరణిని ఎండగట్టామని సంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఎవరు ఏమి అనుకున్నా ఈసారి శీతాకాల సమావేశాలు మాత్రం ప్రజా సమస్యల మీద పెద్దగా చర్చించలేదని అంటున్నారు. మేధావులు, రాజకీయ నిపుణులు పెదవి విరుస్తున్నారు. సభలలో రచ్చ రభస ఎక్కువ అవుతోందని, ఆఖరికి పార్లమెంట్ బయట బాహాబాహీ వంటి దృశ్యాలు కూడా గతంలో చూడనివి చోటు చేసుకుంటున్నాయని ప్రజాస్వామ్య ప్రియులు అయితే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### వివాదాలు ఆగేదెప్పుడు?

ఆదర్శానికి ప్రపంచానికి చూపి ఓ రోల్ మోడల్ గా ఉండాలని' ఆర్ఎస్ఎస్ చీఫ్ సూచించారు. అయోధ్య రామమందిరం పూర్తయిన తర్వాత దేశంలో ఎక్కడో చోట మందిర్ – మసీదు వివాదాలు రేపి హిందూ నాయకులుగా గుర్తింపు పొందాలనుకోవడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. రామ మందిరం నిర్మాణమనేది హిందువుల నమ్మకానికి సంబంధించినది. ఇకపై కొత్త వివాదాలు తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉందని మోహన్ భగవత్ స్పష్టం చేశారు. దేశంలో ఇటీవల కొన్నిచోట్ల హిందూ ఆలయాలపై మసీదులు, దర్గాలు నిర్మించారని ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై సర్వేలు చేసి ఆలయాలను పున: ప్రతిష్ఠించాలని చాలా మంది కోర్టులకు వెళుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే తన ప్రసంగంలో ప్రత్యేకంగా ఏ ఆలయం మసీదు పేరు ప్రస్తావించకపోయినా ఉత్తరప్రదేశ్ లో ఇటీవల సంచలనం రేపిన పలు మసీదు వివాదాలపైనే మోహన్ భగవత్ వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. బయట నుంచి కొన్ని గ్రూపులు మళ్లీ పాత పాలన తేవాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. ఇప్పుడు దేశంలో రాజ్యాంగబద్ధ పాలన నడుస్తోంది. ఈ వ్యవస్థలో ప్రజలు తమ ప్రతినిధులను, ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. ఆధిపత్యం చెలాయించే రోజులు పోయాయి అని తేల్చిచెప్పారు. ప్రతి ఒక్కరూ తమను తాము భారతీయులుగా చెప్పుకోవాలి. ఆధిపత్య భాష ఎందుకు? ఎవరు మెజార్టీ? ఎవరు మైనార్టీ? ఎవరికి ఇష్టమైన దేవుడుని వారు కొలుస్తారని చెప్పుకొచ్చారు. చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు.

### క్రైమ్ బ్రాంచ్‌కి రాహుల్ కేసు

నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో కొంత ఉద్రిక్తత వాతావరణ ఏర్పడింది. ఈ క్రమంలో చోటు చేసుకున్న తోపులాటలో బీజేపీకి చెందిన ఇద్దరు ఎంపీలు తీవ్రంగా గాయపడ్డారు. రాహుల్ తోసివేయడం వల్లే వారు గాయపడ్డారని, ఆయనపై కేసు నమోదు చేయాలని బీజేపీ ఫిర్యాదు చేసింది. అయితే, తాము ఎలాంటి దాడులకు పాల్పడలేదని రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలు చెప్పారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యల నుంచి దృష్టి మరల్చేందుకే బీజేపీ ఈ ఆరోపణలు చేస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. అధికార, విపక్ష ఎంపీల మధ్య తోపులాట జరుగుతుంటే.. భద్రతా సిబ్బంది జోక్యం చేసుకోకపోవడం చిత్రంగా ఉందన్నారు. ఎలాంటి పక్షపాతం లేకుండా స్పీకర్ ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఇలావుండగా, పార్లమెంట్ ప్రాంగణంలో మహిళా ఎంపీ పట్ల రాహుల్ గాంధీ అభ్యంతరకరంగా ప్రవర్తించడాన్ని జాతీయ మహిళా కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

### కాలి నడక

దర్శనమిస్తున్నాయి. ఇలా చుట్టూ కొండలు, లోయలు, ఎటు చూసినా పచ్చని వాతావరణం కనిపిస్తుండటం.. మరోవైపు వరుణుడు చినుకులు కురిపించడంతో పవన్ కల్యాణ్ ఒక్కసారిగా పులకించి పోయినట్లున్నారు. దీంతో... తన కాన్వాయ్ ని ఆప్పించారు.. అనంతరం.. సెక్యూరిటీ గొడుగు పట్టుకోగా.. మెడలో సాలువా కప్పుకుని తనదైన శైలిలో నడక మొదలుపెట్టారు. ఇలా బయలుదేరిన పవన్ కల్యాణ్ సాలూరు నియోజకవర్గంలోని బాగుజోల గ్రామంలో పర్యటించారు. ఈ సమయంలో అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు. మరోపక్క మక్కువ మండలం, కవిరి పల్లి గ్రామం ప్రారంభం నుంచి చివరి వరకూ కాన్వాయ్ ను వదిలి కాలినడకన వెళ్లిన ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట హల్ చల్ మొదలుపెట్టింది. ఇదే సమయంలో... చీపురు వలస సమీపంలోని వెంగళరాయసాగర్ వ్యూ పాయింట్ వద్ద ఆగి ప్రకృతి అందాలను తిలకించిన పవన్ కల్యాణ్.. కొండల జలపాతాలను స్వయంగా మొబైల్ లో బంధించారు. ఈ సందర్భంగా... ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, అడ్వంచర్ టూరిజం దిశగా అడుగులు వేయాలని అధికారులకు సూచించారు. ఈ విధంగా గిరిజన గ్రామాల్లో పవన్ కల్యాణ్ కాలి నడకన పర్యటిస్తు అక్కడి స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామాల్లోని అంతర్గత రహదారులను పరిశీలించారు. ఇందులో భాగంగా.. శంబర గ్రామంలో పనికి ఆహార పథకం నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును పరిశీలించారు.

### ఏపీలో ఇన్నోవేషన్ వర్సిటీ

ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం అకడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్స్ ను ఏకీకృతం చేసే దిశగా పని చేయనుంది. అలాగే పరిశోధన, విద్య, ఉపాధిలో కీలక సవాళ్లను పరిష్కరించడంపై దృష్టిసారిస్తుంది. హబ్–అండ్–స్పోక్ మోడల్ ఆధారంగా ఇన్నోవేషన్ యూనివర్శిటీ సెంట్రల్ హబ్‌గా పనిచేస్తుంది. విభిన్న నేపథ్యాలు, ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు సమకాలీన, హైబ్రిడ్ విద్యను అందుబాటులోకి తెస్తారు. ఆన్‌లైన్, వ్యక్తిగత అభ్యసన అనుభవాలను ఇంటిగ్రేట్ చేస్తారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ తో ఫిజిక్స్ వాలా కలిసి పనిచేస్తుంది. కృత్రిమ మేధలో ఏపీ యువతను నెం.1గా తీర్చిదిద్దాలన్న సీఎం చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా ఈ ఒప్పందాలు జరిగాయని నారా లోకేష్ తెలిపారు. అధునాతన ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడం, అందుకు ఏపీ యువతను సన్నద్ధం చేయడమే తమ లక్ష్యమన్నారు. పరిశ్రమల డిమాండ్, ప్రమాణాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్ మెంట్ పై యూనివర్సిటీ ఆఫ్ ఇన్నోవేషన్ దృష్టిసారిస్తుందని చెప్పారు. అధునాతన సాంకేతికత, విద్యను ఏకీకృతం చేయడానికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ కృషిచేస్తుందన్నారు. ఫిజిక్స్ వాలా వ్యవస్థాపకుడు, సిఇఓ అలఖ్ పాండే ప్రభుత్వంతో తాము కుదుర్చుకున్న ఒప్పందం ఇన్నొవేషన్ విశ్వవిద్యాలయం స్థాపనలో తొలి అడుగన్నారు. ఇందుకు యుఎస్ జీఎస్వీ వెంచర్స్, ఇతర పెట్టుబడిదారుల ద్వారా రూ.1000 కోట్ల వరకు పెట్టుబడి పెడతామన్నారు. మరోవైపు ఏపీలో ఉన్నత విద్యా వ్యవస్థను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ తో ప్రభుత్వం అవగాహన ఒప్పందంపై చేసుకుంది. ఈ కార్యక్రమంలో టిబిఐ కంట్రీ డైరక్టర్ వివేక్ అగర్వాల్, అసోసియేట్ ముంజులూరి రాగిణి రావు పాల్గొన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఏపీ విద్యార్థులను తీర్చిదిద్దడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. అంతర్జాతీయంగా విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎపి ఉన్నత విద్యలో చేయాల్సిన మార్పులపై టీబీఐ ప్రభుత్వానికి సలహాలు ఇవ్వనుంది.

### కాంగ్రెస్‌తో జగన్‌కి

అనేక ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం పనిచేశారు. ముఖ్యంగా తన తండ్రి వైఎస్సార్ గెలుపు కోసం సొంత జిల్లాలో తిరిగారు. ఇక జగన్ కి కాంగ్రెస్ తో మరో విచిత్ర బంధం ఏంటి అంటే కాంగ్రెస్ ని ధిక్కరించే ఆయన పెద్ద లీడర్ గా గుర్తింపు తెచ్చుకున్నారు. కాంగ్రెస్ ఆయనను పదహారు నెలలు జైలులో పెట్టించడం వల్లనే ఆయన వైసీపీని స్టార్ట్ చేసి ఏపీలో తిరుగులేని లీడర్ గా ఎస్టాబ్లిష్ అయ్యారు. అలా కాంగ్రెస్ తెలిసీ తెలియకో జగన్ కి బాగానే హెల్ప్ చేసింది అన్నది ఒక విశ్లేషణగా చూడాల్సి ఉంది. ఇక జగన్ వైసీపీలో నూటికి ఎనభై మంది కాంగ్రెస్ వారే చేరి కొత్త పార్టీని సత్తువ కలిగిన పార్టీగా మార్చారు. అలాగే కాంగ్రెస్ ఓటు బ్యాంక్ మొత్తాన్ని జగన్ సొంతం చేసుకుని దశాబ్దాల టీడీపీని ఢీ కొట్టే స్థాయికి ఎదిగారు. ఇవన్నీ ఫ్లాష్ బ్యాక్ కథలే అయితే ఇపుడు మరోసారి జగన్ కి కాంగ్రెస్ తో పెద్ద పని పడింది అని అంటున్నారు. అదెలా అంటే 2011లో ప్రారంభించిన వైసీపీలో అత్యధిక శాతం కాంగ్రెస్ నేతలు ఉంటే ఆ మిగిలిన శాతం టీడీపీ సహా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు. ఇపుడు చూస్తే 2024 లో ఘోర ఓటమి తరువాత వైసీపీ పునాదుల నుంచి ఉన్న వారు కూడా పార్టీని వదిలేసి బయటకు పోతున్నారు. ఇక వైసీపీలో చేరిన ఇతర పార్టీల నేతల సంగతి సరేసరి. వారంతా కూడా వైసీపీ ఫిలాసఫీ నచ్చి చేరలేదు. వారికి కాంగ్రెస్ వాసనలు కూడా లేవు. దాంతో చాలా సులువుగా ఫ్యాన్ పార్టీని వదిలించేసుకుంటున్నారు. దీంతో వైసీపీ డీమోరలైజ్ అవుతోంది. ప్రతీ రోజూ మీడియాలో వస్తున్న వార్తలు అన్నీ వైసీపీకి షాక్ అంటూనే ఉన్నాయి. దానిని చూసి క్యాడర్ షాక్ తింటోంది. మరి క్యాడర్ కి ఉత్సహం తెప్పించేలా వైసీపీ హై కమాండ్ ఏదైనా చేయాలీ అంటే పోయిన చోట వెతుక్కోవాలి. పార్టీని పటిష్టం చేసుకోవాలి. ఇప్పటికిపుడు టీడీపీ కూటమి నుంచి వచ్చే నేతలు ఎవరూ ఉండరు. అధికారం మరో నాలుగున్నరేళ్ల పాటు వారికి జాగ్రత్తగా ఉంటుంది. దాంతో అది అయ్యే పని కాదు. విపక్షంలో చూస్తే కామ్రేడ్స్ ఉన్నారు. వారిది సిద్ధాంత పోరాటం. అందువల్ల అక్కడ నుంచి ఎవరూ వచ్చే సమస్యే ఉండదు. మరి వైసీపీని బలోపేతం చేసుకోవాలీ అంటే ఏమి చేయాలి అన్నది చూస్తే కనుక కాంగ్రెస్ అన్న జవాబే వస్తుంది. ఏపీలో కాంగ్రెస్ కి ఒక్క శాతం ఓటు బ్యాంక్ ఉన్నా ఇంకా ఆ పార్టీని అట్టే బెట్టుకుని ఉన్న సీనియర్ నేతలు కనిపిస్తారు.

వారంతా పార్టీ ఏనాటికి అయినా ఎదగకపోతుందా అని చూసి విసిగి ఉన్నారు. కాంగ్రెస్ పెద్దలు కూడా ఏపీ విషయంలో పెద్దగా ఫోకస్ పెట్టడం లేదు అన్న అసంతృప్తి కూడా ఉంది. ఇపుడు షర్మిలను తెచ్చి నాయకత్వ బాధ్యతలు ఇచ్చారు. కేంద్ర మంత్రులుగా చేసి కీలక శాఖలు చూస్తున్న వారు అంతా షర్మిల పోకడలతో దూరంగా ఉంటున్నారు అని ప్రచారంలో ఉంది. సరిగ్గా ఈ పాయింటే ఇపుడు వైసీపీ ఆశలను పెంచుతోంది. కాంగ్రెస్ మీద మరోసారి ఆపరేషన్ ఆకర్ష్ వల విసిరితే వైసీపీకి ఎన్నో రాజకీయ ప్రయోజనాలు చేకూరుతాయని ఆ పార్టీ అధినాయకత్వం భావిస్తోంది. కాంగ్రెస్ లో ఉన్న సీనియర్ నేతలు అనుభవంలో దిట్టలు. జిల్లాలో కూడా ముఖ్యులు. సరైన పార్టీ, ఫ్లాట్ ఫారం దొరకాలే కానీ వారు మళ్లీ గేరు మారుస్తారు అన్నది కూడా ఉంది. అందుకే జగన్ రాయలసీమ మీదుగా కోస్తా గోదావరి ఉత్తరాంధ్రా జిల్లాలలో ఉన్న సీనియర్ కాంగ్రెస్ నేతలను ఆకట్టుకునేందుకు యాక్షన్ ప్లాన్ రెడీ చేసి పెట్టుకున్నారు అని అంటున్నారు. అలా చూస్తే అనంతపురానికి చెందిన మాజీ మంత్రి ఒకరు వైసీపీలో చేరుతారు అని అంటున్నారు. అదే విధంగా ఈ జిల్లా నుంచే మరో కీలక నేత కూడా ఫ్యాన్ నీడకు రావచ్చు అని అంటున్నారు. ఇక చిత్తూరు జిల్లాలోనూ మరో బడుగు బలహీన వర్గాలకు చెందిన నేత వైసీపీలో చేరే చాన్స్ ఉందని అంటున్నారు. గుంటూరు జిల్లాలో కూడా సీనియర్ నేతలు ఉన్నారని వారిని రప్పించాలని చూస్తున్నారు. గోదావరి జిల్లాలో ప్రముఖ నాయకులు కీలక సామాజిక వర్గాలకు చెందిన వారూ ఉన్నారు. వీరి విషయంలోనూ కదిపి చూడాలని అనుకుంటున్నట్లుగా భోగట్టా. అలా వైసీపీ అధినాయకత్వం తమ పార్టీ నుంచి బయటకు వస్తున్న సీనియర్లు కీలక నేతల స్థానంలో కాంగ్రెస్ నుంచి నేతలను తీసుకుని అలా పార్టీని పటిష్టం చేసుకోవాలని చూస్తోంది అని అంటున్నారు. కొత్త ఏడాది ఈ ఆపరేషన్ ఆకర్ష్ మొదలవుతుంది అని అంటున్నారు.

### ఎందుకు జాప్యం !

నేతలు హామీ ఇచ్చారు. మంత్రి తాజా ప్రకటన ఇక, ఇప్పుడు రాష్ట్రంలో ఈ పథకం అమలు పైన రవాణా శాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి కీలక ప్రకటన చేసారు. త్వరలో మహిళలకు ఉచిత బస్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఏపీఎస్ఆర్టీసీ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ఏపీఎస్ఆర్టీసీ డోర్ డెలివరీ సర్వీస్‌ను మంత్రి ప్రారంభించారు. కార్గో సర్వీస్‌ను డోర్ డెలివరీ ప్రారంభించటం సంతోషంగా ఉందని చెప్పారు. ప్రజలకు సేవ చేసే సిబ్బంది మరింత చేరువ కావటానికి డోర్ డెలివరీ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. మంచి బస్సులను ప్రయాణికుల కోసం సిద్ధం చేశామన్నారు. కొద్ది రోజుల్లో 500 కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సంక్రాంతికి ప్రారంభం కొత్త సంవత్సరం ప్రారంభమైన తరువాత జనవరి నెలలోనే ఈ పథకం అమలు దిశగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. సంక్రాంతి వేళ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు పథకం అమల్లోకి తీసుకు రావాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న బస్సుల సంఖ్య.. పెంచాల్సిన అవసరం.. ఏ కేటగిరీ బస్సుల్లో ముందుగా అమలు చేయాలనే అంశం పైన అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఏసీ బస్సులు మినహా అన్ని కేటగిరీల్లోనూ అమలు చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా సమాచారం. దీంతో, సంక్రాంతికి ఈ పథకం అమలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### కాకినాడ పోర్టులో భారీ ట్విస్ట్‌లు

దిగారు. అప్పటి వరకూ పట్టుకున్న బియ్యాన్ని లైట్ తీసుకున్న వారంతా ఇప్పుడు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భారీ ట్విస్ట్ లు ఎదురవుతున్నాయి. కాకినాడ పోర్టులో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై తీగ లాగితే డొంక కదిలినట్లు కొత్త కొత్త విషయాలు తెలుస్తున్నాయి. ముఖ్యంగా కాకినాడ పోర్టు నుంచి ఏపీ, తెలంగాణతో పాటు మొత్తం ఆరు రాష్ట్రాలు రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తేలింది. అలాగే ఓ కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి కూడా ఇందులో ఉన్నట్లు తేలింది. ఏపీ, తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఛత్తీస్ ఘడ్, బీహార్, జార?ండ్ నుంచి రేషన్ బియ్యం అక్రమంగా కాకినాడ పోర్టుకు చేరుకుని ఇక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది. ఏపీ పౌరసరఫరాల శాఖ రేషన్ బియ్యం అక్రమ ఎగుమతులపై ఫోకస్ పెట్టింది. ఇప్పటికే 13 కేసులు నమోదు చేసి 137 మిల్లులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు గుర్తించింది. ఇందులోనే ఏపీ, తెలంగాణతో పాటు మొత్తం ఆరు రాష్ట్రాలు, పుదుచ్చేరి లో మిల్లుల నుంచి ఇలా బియ్యం ఎగుమతి చేస్తున్న సంస్థలకు చేరుతున్నట్లు తేలింది. ముంబై, ఢిల్లీ కేంద్రాలుగా కొంతమంది వ్యక్తులు రేషన్ మాఫియాను నిర్వహిస్తూ ఈ ఎగుమతుల వెనుక ఉన్నట్లు సమాచారం. దీంతో ఇదంతా కేంద్ర, రాష్ట్రాలకు తెలిసి జరుగుతుందని అర్థమవుతోంది.

#### అంబేడ్కర్‌పై షా వ్యాఖ్యలను కప్పిపుచ్చేందుకే

## ఎంపీల తోపులాట




అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు ఏ తెలుగు నాయకుడూ గుర్తించని కోణాన్ని ఆమె గుర్తించారు. తాజాగా ముగిసిన పార్లమెంటు సమాశాలు అత్యంత వాడివేడిగా సాగిన సంగతి తెలిసిందే. దీంతోపాటు గురువారం పార్లమెంటు ప్రాంగణంలో ఎంపీల తోపులాట అత్యంత వివాదాస్పదం అయింది. అదానీ, మణిపూర్, ఢిల్లీ పార్లమెంటు శీతాకాల సమావేశాలు అత్యంత హాట్ హాట్ గా సాగాయని చెప్పడంలో తప్పు లేదు. గత నెల 25న మొదలైన ఈ సమావేశాలు గురువారం వరకు ప్రతి రోజూ చర్చనీయాంశంగానే ఉన్నాయి. ఇక సరిగ్గా సమావేశాలకు ముందు ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదు, మణిపూర్ లో మళ్లీ హింస చెలరేగడం, ఢిల్లీలో తీవ్ర వాయు కాలుష్యం మీద రగడ ఖాయం అని భావించారు. ఇదే సమయంలో జమిలి ఎన్నికల బిల్లులు తోడయ్యాయి. లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు (జమిలి ఎన్నిక బిల్లును) లోక్ సభ గత శుక్రవారం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపింది. మంగళవారం రాజ్యసభలో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. అయితే, ఇది రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉందని, సంయుక్త పార్లమెంటరీ కమిటీకి (జేపీసీ) పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అన్ని పక్షాలూ విస్తృత చర్చ కోరుతున్నందున ప్రభుత్వం జేపీసీకి పంపింది. చర్చలో రచ్చ కాగా బుధవారం పార్లమెంటులో చర్చ సందర్భంగా కేంద్రం హోంమంత్రి అమిత్ షా.. అంబేద్కర్ గురించి చేసిన వ్యాఖ్యలపై ఇండియా కూటమి పెద్దఎత్తున నిరసనలకు దిగిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో గురువారం పార్లమెంటు ప్రాగణంలో ఎంపీల తోపులాట జరిగింది. దీనిపైనే షర్మిల స్పందించారు. అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యల నేపథ్యంలోనే ఇలాంటి పరిస్థితి కల్పించారని ఆరోపించారు. షా వ్యాఖ్యల వివాదం నుంచి పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నారని పేర్కొన్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ




### పంటల రాబడిలో 60 శాతం రుణాన్ని పొందే విధంగా

## రుణ పరిమితులను నిర్ధారించాలి

**జిల్లా కలెక్టర్ అర్ మహేష్ కుమార్**





**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం డిసెంబర్ 20: జిల్లా వ్యాప్తంగా సాగులో ఉన్న వివిధ పంటల రాబడిలో 60 శాతం రుణాన్ని పొందే విధంగా రుణపరిమితులను నిర్ధారించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ 2025- 26 సమావేశాన్ని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన పశు వర్ధనం, మత్స్య, శాఖలకు సంబంధించిన రుణ పరిమితులను జిల్లా స్థాయిలో సాంకేతిక కమిటీ ప్రతిపాదించిందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడి, ఉత్పాదక వ్యయం, ఇన్ ఫుట్ ధరల పెరుగుదల వంటి అంశాల ఆధారంగా తీసుకుని 2025-26 సంవత్సరానికి రైతులకు అందించే రుణ పరిమితులను ప్రతిపాదించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, కొబ్బరిలో అంతర్ పంటలు అరటి, కూరగాయలు, పాడి, కోళ్ల పరిశ్రమ, మత్స్య సాగు కార్యకలాపాలు చేపట్టే రైతులకు ఉత్పాదక వ్యయం, నర్సరీ వర్కింగ్ క్యాపిటల్ మరియు రాబడులు ఆధారంగా బ్యాంకుల ద్వారా అందించే రుణ పరిమితులను ఆయా శాఖల జిల్లా అధికారులు కమిటీకి వివరించారు. ఉత్పాదక వ్యయంలో కనీసం 60 శాతం పంట రుణాలుగా అందించేందుకు ఆయా అంశాల క్రింద స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితులను కమిటీ నిర్ణయించిందన్నారు. ప్రధానంగా వరి పంటకు సంబంధించి ఎకరాకు ఖరీఫ్ లో 49, 820 రూపాయలుగా, రబీలో 56,262 రూపాయలుగా రుణ పరిమితులుగా నిర్ణయించారు. జిల్లాలో రైతులు పండించే వ్యవసాయ ఇతర వాణిజ్య పంటలకు, మత్స్య రంగంలో రొయ్యలు, చేపలు సాగుకు గత ఏడాది నిర్వహించిన పెట్టుబడి మొత్తాలను సవరించాల్సిన ఆవశ్యకత ఉందని ముఖ్యంగా మత్స్యశాఖ పశుసంవర్ధక శాఖ రుణ పరిమితులను ఈ సంవత్సరం పెరిగిన ఉత్పాదకత వ్యయాలు, రాబడులను మరొక్కమారు నిశితంగా అధ్యయనం చేసి రుణ పరిమితులను నిర్ధారిస్తూ రాష్ట్రస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా పశు కేసీసీ లబ్ధిదారులకు పాడి గేదె ఒక్కంటికి లక్ష ఇరవై వేలు, పాడి ఆవులకు లక్ష రూపాయలు వర్కింగ్ క్యాపిటల్ గా నిర్ణయించారు. గేదెలు, ఆవులకు పాలిచ్చే సమయం, నాట్ మిల్కింగ్ సమయాలను దృష్టిలో ఉంచుకొని నిర్వహణ కొరకు రుణ పరిమితులను కచ్చితంగా నిర్ధారించాలన్నారు. జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితుల ప్రతిపాదనలన్నింటిని క్రోడీకరించి రాష్ట్ర కమిటీ ఆమోదానికి పంపాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులకు ఈ సందర్భంగా సూచించారు. మొక్కజొన్న రబీలో సాగుకు ఎకరాకు 35, 850 రూపాయలు గాను, పప్పు దినుసులు సాగుకు ఎకరాకు 22, 700 రూపా యలు గాను రుణ పరిమితిని ప్రతిపాదించడం జరిగిందన్నారు. పూల సాగుకు రుణ పరిమితులు నిర్ణయించడం జరిగిందని మేజర్ క్రాప్ ఫిష్ ప్రొడక్షన్ కు రెండున్నర లక్షల వరకు రుణ పరిమితిగా తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. కొబ్బరి సాగుకు సంబంధించి నిర్వహణ ఎరువులు, ఫ్లవి%శీ%గ్, కోకో కూరగాయలు వంటి అంతర పంటల సాగు వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకొని అన్నింటికీ కలిపి రుణ పరిమితులు నిర్ధారించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో అరటి సాగుకు సంబంధించి కూడా మరొకసారి రుణ పరిమితులను పరిగణనలో తీసుకుని అధ్యయనం చేస్తూ నిర్ధారించాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీసీబీ కార్యనిర్వహక అధికారి ఆర్.వి.నరసింహ రావు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, జిల్లా పశుసంవర్ధక శాఖ వెంకట్రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్ శ్రీని వాసరావు, జిల్లా ఉద్యాన అధికారి బి వి రమణ, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్, స్వామి నాయుడు, లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవ వర్మ ఎస్బీఐ డీప్యూటి రీజనల్, అధికారులు, ఇతర బ్యాంకుల అధికారులు, అభ్యుదయ రైతులు, డీసీసీబీ బ్యాంకు సిబ్బంది ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సహజ ఇంధన వనరులు

## పొదుపుగా వాడుకోవాలి

**జిల్లాలో ప్రతి ఇంటిపైన, కార్యాలయాలపైన సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ ఏర్పాటుకు చర్యలు**

**జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి వెల్లడి**



**కాకినాడ కలెక్టరేట్ :విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంధనం వనరులు భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో ప్రతి ఒక్కరు ఇంధన పొదుపుపై అవగాహన పెంపొందించు కోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమాల సందర్భంగా శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంధన పొదుపు అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్.. విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల కార్యక్రమాలను కాకినాడ జిల్లాలో కూడా గత ఏడు రోజులుగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లాలో ఇంధన పొదుపుపై వివిధ అవగాహన కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు సందర్భంగా ఇంధనం వనరులు భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో ప్రతి ఒక్కరు ఇంధన పొదుపుపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. గృహ ఉపకారణాల్లో నిత్యం మనం వినియోగించే విద్యుత్తు పరికరాలు స్టార్ రేటింగ్ ఉన్నవే మాత్రమే వినియోగించాలని ఆయన తెలిపారు. అదేవిధంగా ఇప్పటికే గృహాల్లో ఉన్న ఏసీ, రిఫ్రిజిరేటర్లు ఇతర విద్యుత్తు పరికరాలు తక్కువ కరెంటు వినియోగంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా ప్రతి ఇళ్లు, ప్రతి ప్రభుత్వ కార్యాలయం పైన సోలార్ ప్యానల్ ఉండేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ పథకం కింద రాయితీపై సోలార్ ప్యానల్ అందిస్తుందన్నారన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇంటిపైన 100 చదరపు అడుగులు స్థలంలో ఒక కిలో వాట్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఒక కిలో వాట్ సోలార్ ప్యానల్ ఏర్పాటుచేసుకోవడానికి రూ.70 వేలు ఖర్చు అవుతుందని ఇందిలో 30 వేల రూపాయలు ప్రభుత్వం రాయితీస్తుం దన్నారు. సగటున నెలకు వెయ్యి రూపాయలు కరెంటు బిల్లు వచ్చే గృహానికి ఒక కిలో వాట్ సోలార్ ప్యానల్ ద్వారా 330 రూపాయిలు మాత్రమే కరెంటు బిల్లు వస్తుదన్నారు. ఈ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా సంవత్సరానికి సుమారుగా 8వేల రూపాయలు



ఆదా చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కాకినాడ జిల్లాలో ప్రతి ఇల్లు ప్రతి ప్రభుత్వ కార్యాలయం పైన సోలార్ ప్యానల్ ఏర్పాటను ఒక ఉద్యమంలా చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందుకు అనుగుణంగా గ్రామాల వారిగా సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసే ఏజెన్సీలను గుర్తించడం జరిగిందని జిల్లా కలెక్టర్ అన్నారు. ఇంధన పొదుపుపై నిర్వహించిన అవగాహన ర్యాలీ కలెక్టరేట్ ఆవరణంలో ప్రారంభమై.. జిల్లా పరిషత్ జంక్షన్, జీజీహెచ్ రోడ్ మీదుగా బాలాజీ చెరువు వరకు సాగింది. “నేటి సత్సంకల్పం- రేపటి వెలుగుల సహకారం”బీ “కరెంటు ఆదా చేద్దాం - భవిష్యత్ తరాలకు భరోసానిద్దాం”.. అంటూ సీబీఎం కళాశాల విద్యార్థులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నినాదలతో ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి. ప్రసాద్, కాకినాడ పెద్దాపురం జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎన్ ఉదయ్ భాస్కర్, ఎ. ప్రభాకర్, వీరభద్రరావు, ఏడీఈలు, ఏఎఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఆల్ ఫ్రెండ్స్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి అర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ పేరూరు పేట లో ఆల్ ఫ్రెండ్స్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించుము వ్యవస్థాపకులు డాక్టర్ సిహెచ్ జాన్ మోజస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఒక దేశానికో, ఒక ప్రాంతానికో కాకుండా యావత్తు లోకానికే రక్షకుడని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలు నడుమ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవిడ్ తాంబీ ,మొసలి స్పర్జన్ రాజ్, జల్లి శ్రీనివాస్ , ఇమామ్ మొహమ్మద్ అల్తాఫ్ , ప్రముఖ హిందూ ఆర్ఎస్ఎస్ నాయకులు దొరబాబు,లాయర్, అంబేద్కరిస్ట్ కోలా త్రిమూర్తులు లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిషప్ కె విజయభాస్కర్ , జె విక్టర్ కుమార్, పాస్టర్ పి ప్రభు రాజేష్ కుమార్ , పాస్టర్ యు విజయభాస్కర్ , పాస్టర్ యు జాన్ పాల్ , సీనియర్ పాస్టర్ చవ్వాకుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

### రెచ్చిపోతున్న

## మట్టి మాఫియా

**అక్రమ మట్టి తరలింపు.. మూడు లారీలు సీజ్**



**కపిలేశ్వరపురం, విశ్వంవాయిస్ :** కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్ లారీలను సీఐ దొరరాజు ఆధ్వర్యంలో అంగర ఎస్సై డి రవికుమార్ సీజ్ చేయడం జరిగింది. సీజ్ చేసిన లారీలను అంగర స్టేషన్ కు తరలించి తదుపరి చర్య నిమిత్తం మైనింగ్ శాఖ అధికారులకు నివేదిక ఇచ్చామన్నారు.ఎవరైనా అక్రమంగా మట్టి,ఇసుక తరలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సి.ఐ దొరరాజు హెచ్చరించారు.

## సబ్‌జైల్‌లో పరిశీలన



**నరసాపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** 70 ఏళ్లు పైబడిన, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న జైల్ నిందితుల వివరాలను తెలుసుకొనేందుకు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏలూరు, పశ్చిమగోదావరి ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం నరసాపురం ఉపకారాగారానికి వచ్చారు. వృద్ధాప్యంలో, అనారోగ్యంతో బాధపడుతున్న నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న వైద్య సదుపాయాల గురించి జైల్ సూపరింటెండెంట్‌ను, జైల్ విజిటింగ్ జె.గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాల, ఆహార పదార్థాలను, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

### నిర్దిష్టమైన ప్రణాళికలతోనే

## పురోభివృద్ధి



**ఆలమూరు, విశ్వంవాయిస్ :** నిర్దిష్టమైన ప్రణాళికల రూపకల్పన చేయడం ద్వారానే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ లు తప్పక పురోభివృద్ధి సాధిస్తాయని ఎంపిడిఒ, ఇంచార్జ్ డిఎల్పిఓ ఏ.రాజు, మండల ప్రత్యేక అధికారి ఏడిఏ కె.నాగేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులకు, సర్పంచులకు, ఎంపీటీసీలకు 2024 %-% 25 ఏడాదికి గాను జిపిడిపి, బిపిడిపిలపై ఒక రోజు మండల స్థాయి శిక్షణ తరగతులు శుక్రవారం ఎంపీడీవో రాజు ఆధ్వర్యంలో నిర్వహించి పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాజు మాట్లాడుతూ పంచాయతీలు గాని, మండల పరిషత్ గాని నిర్వహణలో పరస్పర అవగాహనతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రతి అంశం పైన వివరించిన వారు ముఖ్యంగా పారిశుధ్యం, వీధి లైట్ల నిర్వహణ వంటి అంశాలపై మరింతగా శ్రద్ధ తీసుకుని అవగాహనతో నడుచుకోవాలని సూచించారు. ప్రజా అవసరాల దృష్ట్యా పంచాయతీలలో తప్పనిసరిగా కొన్ని అంశాలపై దృష్టి పెట్టి పని చేయాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందన్నారు. పంచాయితీ వ్యవస్థలో ప్రజా ప్రతినిధులు కార్యదర్శులు చేయాల్సిన విధులు, బాధ్యతలు, పరిపాలన, అధికారాలు వంటివి తప్పకుండా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, మండల పరిషత్తు ఏవో ఏం.వి.మెహర్ ప్రకాష్, ఏపీఎం ఎం.ధనరాజు, ఏపీవో జి.అరుణ కుమారి, టిఓటి కె.సాయి ప్రసాద్, కార్యదర్శులు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

### నగరంలోని రోడ్లు... డ్రైనేజీ సమస్యలకు

## శాశ్వత పరిష్కారం

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్.. రూ.41.78 లక్షలతో 37,42,43 డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** నగరంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. రూ. 41.78 లక్షలతో 37, 42, 43 డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల కోసం బ్రదరన్ చర్చి వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ప్రజలకు అవసరమైన నగరంలోని రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధిని గాలికి వదిలేసి డివైడర్లకు బిల్లలు అతికించేందుకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక నగరంలో సుమారు 10 కోట్లు విలువైన పనులు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే 22 కోట్ల 51 లక్షలు పనులు జరుగుతున్నాయన్నారు. ఇంకా 3 కోట్ల 90 లక్షల పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా 3 కోట్ల 42 లక్షల పనులు టెండర్ స్టేజ్‌లో ఉన్నాయన్నారు. 70 కోట్ల పనులు ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల్లో పనులు ప్రారంభించగలిగామంటే అది ఎన్డీఏ కూటమికి అభివృద్ధి పట్ల ఉన్న బాధ్యత అన్నారు. ప్రజలకు ఏద్కైతే అవసరమో ఆ పనులు మాత్రమే చేస్తాం కానీ గత వైకాపా నేతల్లా పబ్లిసిటీ కోసం మాత్రం ఏ పని చేయమన్నారు. నగరానికి 70 కోట్ల పనులు అవసరం పడతా ఉన్నాయంటే గత ఐదు సంవత్సరాలు వైకాపా పాలకులు ఏం చేయలేదని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. సాంస్కృతికి రాజధాని రాజమండ్రి...ప్రజలకు ఏం అవసరమో ఆ పనులు చేస్తామన్నారు. కల్చరల్, స్పోర్ట్స్ హబ్‌గా నగరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం కోసం తాము కృషి చేస్తున్నామన్నారు. ఏది ఏమైనా ఆరోగ్యకర రాజమండ్రి, గుంతలు లేని సుందరమైన నగరాన్ని ప్రజలు త్వరలోనే చూస్తారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంటిపూడి శ్రీనివాస్, నక్కా దేవీవరప్రసాద్, ఉర్లంకల లోకేష్, తంగెళ్ళ బాబి, జి రామకృష్ణ, మళ్ల వెంకరాజు, పిల్లి శ్యామ్, దాస్యం ప్రసాద్, పాలవలస భద్రం, సలాది ఆనంద్, కందికొండ అనంత్, వానపల్లి శ్రీనివాస్, చిటికిన సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.



## ముమ్మర తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

**ముమ్మరంగా వాహన తనిఖీలు రికార్డులు తప్పనిసరి : ఎస్సై నరసింహమూర్తి**

**రాజవొమ్మంగి, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజవొమ్మంగి స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్లో రాజవొమ్మంగి సబ్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి తమ సిబ్బందితో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కాకరపాడు జడ్డింగ్ రోడ్డు మీద ప్రయాణిస్తున్న వాహనాలు తనిఖీ చేశారు. అటుగా వెళుతున్న కార్లను ఆపి డిక్కీలను తనిఖీ చేశారు. మద్యం సారా సేవించి వాహనాలు నడప రాదని అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేకమైన పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషను సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



## తాళ్లరేవులో ప్రజాసంఘాల ఆందోళన



**అమిత్ షాను కేంద్ర హెూం మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్**

**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** తాళ్లరేవులో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై పార్లమెంట్లో అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే స్పందించి అమిత్ షాను కేంద్రమంత్రి నుండి బర్తరఫ్ చేయాలని, అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు, కెవిపిఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

## తాళ్లరేవులో అత్యధిక వర్షపాతం



**రైతుల్లో ఆందోళన**

**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్:** మండలంలో శుక్రవారం వాతావరణం మార్పుల్లో కారణంగా అల్పపీడన ప్రభావంతో తాళ్ళరేవు మండలంలో అత్యధిక వర్షపాతం నమోదయింది. 4.6 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదయిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కాకినాడ జిల్లా మొత్తంగా చూస్తే 10.6 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదయిందని, తాళ్ళరేవులో అత్యధికంగా 4.6 మిల్లీలీటర్ల వర్షపాతం జిల్లాలోనే అత్యధికంగా తాళ్ళరేవులో నమోదయిందని తెలిపారు. పంట పొలాల్లో రైతులు కొన్నిచోట్ల ఇంకా వరి చేలు పనులు ఉన్నప్పటికీ కొంతమేర రైతులు ఆందోళనలో ఉన్నారు.





## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

**విద్యుత్ శాఖ ఏఈ జి.రాజ్‌కపూర్**




**కూనవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా, కూనవరం మండలం లో ఈనెల 14-12-2024 వ తేది నుండి 20 -12-2024వ తేది వరకు మండల విద్యుత్ శాఖ వారి ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు జరిగినాయి. ఈ వారోత్సవాలు సందర్భంగా మండల విద్యుత్ శాఖ ఏఈ జి. రాజ్ కపూర్ ఆధ్వర్యంలో మండలంలో పలు పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతి పాఠశాలలోని ప్రథమ, ద్వితీయ బహుమతులు ని ఎంపిక చేసి బహుకరించారు. జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లోని విజేతలు వివరాలు. మర్రిగూడెం హై స్కూల్ ప్రథమ బహుమతి :జె అలేఖ్య ద్వితీయ బహుమతి :ఏ.అభిషేక్, విజయ సాధన హైస్కూల్ ప్రథమ బహుమతి :హర్షిత్ సాయి సచిన్, ద్వితీయ బహుమతి ఎం. రిషిత, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ప్రథమ బహుమతి ఏ.అఖిలండేస్వరి, ద్వితీయ బహుమతి పి. ప్రియా వీరికి విద్యుత్ శాఖ ఏఈ జి. రాజ్ కపూర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. విద్యుత్ శాఖ ఏ ఈ జి. రాజ్ కపూర్ మాట్లాడుతూ ఇంధనం పొదుపు చేయడం వల్ల లాభాల గురించి విద్యార్థులకు అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, తదితరులు పాల్గొన్నారు.

## ఉక్రెయిన్ యుద్ధం కన్నా దేశ రోడ్డు మరణాలే ఎక్కువ ...!

**- కాకినాడ జిల్లా రవాణాశాఖ డి.సీ. శ్రీధర్ - కత్తిపూడి సీతారామలో రోడ్డు భద్రతా కార్యాలు**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఉక్రెయిన్ యుద్ధంలో మరణించిన పౌరుల సంఖ్య కంటే మన భారతదేశంలో ఏటేటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ ప్రాణ నష్టం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణాశాఖ అనుబంధ కాకినాడ జిల్లా శాఖ ఉప రవాణా కమీషనర్ శ్రీధర్ పేర్కొన్నారు. రోడ్డు రవాణాలో ప్రమాదాలు సంభవించాక క్షతగాత్రులకు వెంటనే సహాయక చర్యలను చేపట్టడం, రక్షించడాన్ని భారత రాజ్యాంగం ఈ దేశ పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక విధుల్లాగే భావించి అవసరమగు సేవలను తక్షణమే అందించాలని శ్రీధర్ పిలుపును ఇచ్చారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి శ్రీ సీతారామ జూనియర్, డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై అవగాహన కార్యశాలను శుక్రవారం ఉదయం నిర్వహించారు. స్థానిక రోడ్డు రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీధర్ విధ్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇలా రోడ్డు ప్రయాణ ప్రమాద బాధితులు, క్షతగాత్రులకు సహాయక చర్యలను అందించిన వారికి కేంద్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను కూడా అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. డ్రైవింగ్‌లో నైపుణ్యం సరిగా లేకపోవడం, రోడ్డు భద్రతా జాగ్రత్తలు పాటించక పోవడం, అవగాహన లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, నానాటికీ అసురక్షిత వాహన చోదక ధోరణి పెరుగుతోందని ఇవన్నీ వాహన ప్రమాదాలకు దారి తీస్తున్నాయి అన్నారు. రహదార్లపై ఇతర వాహన చోదకులు, పాదచారుల దృష్టిని మరల్చే అవాంఛిత హారన్‌లను నివారించడం, ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు నాణ్యమైన ఐఎస్ఐ ప్రమాణం ఉన్న హెల్మెట్లను ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండటం, వాహన నిర్వహణ ఫ్రీక్వెన్సీ ప్రకారం వాహనం సరిగ్గా సర్వీస్ చేయబడిందని నిర్ధారించుకోడం, రోడ్డు రవాణా సంస్థ నిబంధనలను పాటించడం వంటి సురక్షిత ప్రయాణ విధానాలను సక్రమంగా పాటించడం వల్ల ప్రమాదాలను నివారించ వచ్చు అన్నారు. ప్రయాణాల్లో వేగాని కన్నా సుఖంగా గమ్యానికి చేరుకోడానికి ప్రాధాన్యతను ఇస్తే ప్రమాదాలను అరికట్ట వచ్చుని చెప్పారు. రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే, మీరు తోటి వారిని చైతన్య పరుస్తారని ఈ కార్యశాలను నిర్వహిస్తూ ఉన్నామని కాకినాడ జిల్లా శాఖ ఉప రవాణా కమీషనర్ శ్రీధర్ వివరించారు. కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ ప్రమాదాల ఉదంతాలను వీడియోల ద్వారా చూపించి రహదారి భద్రతపై పలు అంశాలపై అవగాహన కలిగించారు. రోడ్ సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ పద్మావతి మాట్లాడుతూ... ప్రమాదాల్లో క్షతగాత్రుల ప్రాణ రక్షణకు చేపట్టాల్సిన ప్రాథమిక చికిత్స, సిపిఆర్ తదితర అంశాలపై దృశ్య సహితంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఏ.ఎం.బిఐ. సాయిబాబా, కళాశాలల ప్రిన్సిపాల్ వీరబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మొగిలి అక్కారావు, డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అట్టహాసంగా రూరల్ ప్రెస్‌క్లబ్ ఎన్నికలు

**- కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. సీనియర్ పాత్రికేయుడు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రెస్ క్లబ్ ఎన్నికలను నిర్వహించారు. క్లబ్బు అధ్యక్షుడిగా ప్రకాష్ ను కార్యదర్శిగా దాసరి శ్రీనివాస్ ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా వైస్ ప్రెసిడెంట్లుగా ఐ న్యూస్ శీలి లక్ష్మణరావు, సాగర్ సాక్షి నానీ లను, జాయింట్ కార్యదర్శిగా వి. రవికుమార్ ను కోసాధికారిగా వార్త సత్యనారాయణ, మరియు యూనియన్ గౌరవ సలహాదారులుగా వి అర్జున్, బి భాస్కర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ నిరంతరం వార్తల సేకరణలో అనేక ఇబ్బందులు పడే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననిఅన్నారు.తనకు అధ్యక్ష పదవిని ఇచ్చిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా నూతన కమిటీ కలిసి పుష్ప గుచ్చంతో అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన కమిటీ ను నానాజీ అభినందించారు కాకినాడ రూరల్ ప్రెస్ క్లబ్ ఒక అద్భుతమైన స్థానానికి వెళ్లాలని ఆకాంక్షించారు. క్లబ్బుకు అవసరమైన సహాయ సహకారాలు తన నుండి ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు సుధీర్, నానాజీ, కుమార్, ప్రకాష్, శ్రీను సుబ్రహ్మణ్యం, ప్రసాద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వమా దయచేసి మము కరుణించుము

**- అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం - 23న విధుల బహిష్కరణ**
**- స్పందించకుంటే జనవరి 5 నుంచి సమ్మె - ప్రభుత్వానికి 104 ఎంప్లాయిస్ యూనియన్ నోటీస్**



**రాజవొమ్మంగి, విశ్వం వాయిస్ న్యూస్:** 104 ఎంఎంయు ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారం కాలేదని, కావున ఈ నెల 23న ఒకరోజు విధులను బహిష్కరిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ నోటీస్ అందజేసింది. ఈ మేరకు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమి కృష్ణబాబుకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విఆర్ ఫణికుమార్, చేట్ల రాంబాబు డిమాండ్లతో కూడిన నోటీస్‌ను బుధవారం లేఖ ద్వారా పంపారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్ల నిరసన కార్యక్రమం కొనసాగిస్తున్నామని వెల్లడించారు. అరబిందో యాజమాన్యంతో చర్చించి తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సత్వరం ఇప్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో పాటు నవంబర్ ఒకటి నుంచి నిరసన కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు. ఈ నెల 4న అరబిందో యాజమాన్యం తమతో చర్చలు జరిపిందని తెలిపారు. ఇంక్రిమెంట్లు, స్లాబ్సిస్టమ్, బదిలీలు, పిఎఫ్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19 వరకు సమయం కోరిందని పేర్కొన్నారు. ఆ తరువాత చర్చలు జరిపేందుకు యాజమాన్యం నుంచి ఎటువంటి సమాచారం రాలేదని తెలిపారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నామని తెలిపారు. అరబిందో నిర్వహించే గ్రూపుల నుంచి తాము బయటకు రావడంతో పాటు ఎటువంటి డేటాలు అందించబోమని తెలియజేశామని పేర్కొన్నారు. అయినా తమ సమస్యల పట్ల ఎటువంటి పరిష్కారం లభించలేదని వివరించారు. తదుపరి కార్యాచరణగా ఈ నెల 23న విధులను బహిష్కరిస్తున్నామని వెల్లడించారు. అప్పటికీ అరబిందో యాజమాన్యం తమ సమస్యలను పరిష్కరించకపోతే జనవరి 5 తర్వాత ఎప్పుడైనా సమ్మెతో పాటు నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ ప్రధాన ఎంప్లాయిర్ ప్రభుత్వమే కాబట్టి తమ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

### జనవాణి అర్జీలు స్వీకరిస్తున్న కూడా
## చైర్మన్ తుమ్మల రామస్వామి



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద జనవాణి జనసేన భరోసా కార్యక్రమాన్ని చేపట్టిన కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ శ్రీ తుమ్మల రామస్వామి బాబు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ప్రజల సమస్యల పరిష్కార వేదికగా జనసేన అధినేత రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు పంచాయతీ రాజ్ శాఖ మంత్రివర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ చేపట్టిన జనవాణి కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది దీనిలో భాగంగా జనసేన పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు చైర్మన్లు వారంలో ఒకరోజు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్దకు వచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ స్టేట్ సెక్రటరీ రత్నం అయ్యప్ప, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ లీగల్ కమిటీ కార్యదర్శి బైవరపు నరసింహారావు, పెనమలూరు మండలం జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్ మేక స్వాతి తేజ, వై.ప్రకాష్, గలిదేవర నానజీ, తదితరులు పాల్గొన్నారు.

### శాస్త్రోత్తంగా మీసాల రాయుడికి
## జన్మనక్షత్ర పూజలు

**- వనదుర్గ అమ్మవారి ఆలయంలో చండీ హెూమం**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్:** భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా అలరారుతున్న కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం రత్నగిరి శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి జన్మ నక్షత్ర పూజలను శుక్రవారం శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలను నిర్వహించారు. ముందుగా తెల్లవారు జామున రెండు గంటలకు వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ అర్చకులు గర్భాలయంలో ఉన్న శ్రీ స్వామి, అమ్మ వార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానం ఆచరింపజేసారు అనంతరం మహన్యాస రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన పట్టు వస్త్రాలను ధరింపజేసి, వివిధ రకాల సుగంధ భరితమైన పుష్పములతో సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులకు ఐదు గంటలకు శ్రీ స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. తదనంతరం శ్రీ స్వామి, అమ్మవారి పేరు మీద 9 గంటలకు ఆయుష్ హెూమం, చండీ హెూమం నిర్వహించారు. అలాగే శుక్రవారం సందర్భంగా క్షేత్ర పాలకురాలైన శ్రీ వనదుర్గమ్మ వారి ఆలయంలో అమ్మవారికి విఘ్నేశ్వర పూజ, శ్రీ సూక్తం, పురుష సూక్తం, మూల మంత్ర జపములు, నవగ్రహ అర్చన, సూర్య నమస్కారములు, దేవి సోత్రం, తదితర పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు, పండితులు, వ్రత పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 11 గంటలకు ఘనంగా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చండీ హెూమం నిర్వహించుకున్న భక్తులకు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ అర్చకులు, దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి వీర్ల సుబ్బారావు, భక్తులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో భూమి విలువలు పెంపుపై పునఃపరిశీలన చేయండి

**- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్**

**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో మార్కెట్ ధరలు విలువల పెంపుపై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ .. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, రిజిస్ట్రేషన్, స్టాంపులు, రెవెన్యూ, జిల్లా పరిషత్తు, సబ్ రిజిస్ట్రార్లు మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. మార్కెట్ ధరలు విలువలు రివిజన్-2024 అంశంపై మార్కెట్ విలువలు పెంపుదల కొరకు తయారు చేసిన ప్రతిపాదనలపై జిల్లా కలెక్టర్ అధికారులతో ఈ సందర్భంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ మార్కెట్ విలువలు రివిజన్ 2024 ప్రతిపాదనలను ప్రజల నిమిత్తం ఈ నెల 20 నుంచి రిజిస్టర్ ఆఫీసు నోటీసు బోర్డు, వెబ్సైట్ నందు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ ప్రతిపాదనలపై నేటి నుంచి 24వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రివిజన్ చేసిన మార్కెట్ ధరలకు ఈ నెల 27న తుది ఆమోదం తెలపడం జరుగుతుందని, ఆమోదం పొందిన తుది మార్కెట్ ధరల విలువలను జనవరి 01, 2025 నుంచి అందుబాటులోకి వస్తాయని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్తు సీఈవో వీవీవీఎస్.లక్ష్మణరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, కె.శ్రీరమణి, కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు,




రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ శివరాం, మార్కెట్ వాల్యూ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ జెయుఎన్. జయలక్ష్మి, జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం, ప్రత్తిపాడు, సామర్లకోట, తాళ్లరేవు తుని, సర్పవరం, కాకినాడ సబ్ రిజిస్ట్రార్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పిఠాపురం రూరల్
## పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**పిఠాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్:** ఈ తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, భవనమును పరిశీలించారు గంజాయి, రవాణా మరియు వినియోగం పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలని సూచించారు " ఐ ఆమ్ సైబర్ అవేర్నెస్ "కార్యక్రమం ద్వారా సైబర్ నేరాలపై అన్ని విద్యా సంస్థలలో, గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించారు డిజిటల్ అరెస్ట్.. అనేది లేనే లేదని - ఈ విధంగా ఎవరైనా బెదిరిస్తే తక్షణమే దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్ కు సమాచారం అందించాలని, డిజిటల్ అరెస్టుకు భయపడవలసిన అవసరం లేదని ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేసారు. మహిళా



రక్షక్...కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, మహిళా చట్టాలు, మహిళల స్వీయ భద్రతకు తీసుకోవలసిన జాగ్రత్తలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై విద్యార్థిని విద్యార్థులలో అవగాహన కల్పించాలని తెలియజేసారు. ఈ వార్షిక తనిఖీల్లో ఎస్పీ సందర్శించిన పోలీస్ స్టేషన్ నందుకాకినాడ డీ ఎస్ పి రఘువీర్ విష్ణు, పిఠాపురం రూరల్ సీఐ జి శ్రీని వాస్ , ఎస్సై గుణశేఖర్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ సత్య సాయి డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ కార్మికుల సమావేశం

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా శ్రీ సత్య సాయి డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ కార్మికుల యూనియన్ మీటింగ్ ప్రెసిడెంట్ కట్టుమూరి వీరబాబు అధ్యక్షతన ఇందుకూరుపేట పంప్ హౌస్ నందు జరిగింది. కార్మికుల పెండింగ్ జీతాలు మరియు ఈ.ఎస్.ఐ పలు సమస్యల మీద చర్చించడం జరిగింది.

ఈ సమావేశంలో జనరల్ సెక్రటరీ యు.ఇస్సాకు ట్రెజరర్ కె. రామకృష్ణ, కె .మల్లేష్, జె.సురేష్ మరియు ఇతర కార్మికులు పాల్గొన్నారు.



సీతానగరం సబ్ ఇన్స్పెక్టర్ డి. రామ్ కుమార్ ఆధ్వర్యంలో

## నాటు సారా తయారీ కేంద్రాలపై దాడి

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:**

తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం అచ్చయ్యపాలెం గ్రామంలో సీతానగరం సబ్ ఇన్స్పెక్టర్ డి. రామ్ కుమార్ ఆధ్వర్యంలో సీతానగరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలసి నాటు సారా తయారీ కేంద్రాలపై దాడి చేసి 80 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేస ుకున్నారు. నాటు సారా తయారీ కోసం నిలవ ఉంచిన 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, సారా తయారు చేయడానికి ఉపయోగించే ప్లాస్టిక్ డ్రమ్ములను మరియు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.



# 22న సామ్రాజ్య సిల్వర్ కింగ్ డమ్ ప్రారంభం

రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యాన
సేవాభావంతో రోటేరియన్స్ సరికొత్త వ్యాపారం
చైర్మన్ తీగల రాజా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ రోటేరియన్స్ ఆధ్వర్యాన ఈనెల 22న సామ్రాజ్య సిల్వర్ కింగ్ డమ్ పేరిట వ్యాపారం ప్రారంభిస్తున్నట్లు రాజమండ్రి ఐకాన్స్ వాణిజ్య ప్రయివేట్ లిమిటెడ్ చైర్మన్ తీగల రాజా చెప్పారు.సాధారణంగా వ్యాపారంలో వచ్చే లాభంలో కొంత మొత్తాన్ని సేవకు వినియోగించడం జరుగుతోందని అయితే సేవకోసమే వ్యాపారం ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు.స్థానిక సోమాలమ్మ పుంతరోడ్డులోని సామ్రాజ్య ది సిల్వర్ కింగ్ డమ్ షోరూంలో శుక్రవారం ఉదయం రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ప్రెసిడెంట్ ,సంస్థ ఎండి ఇమ్మణ్ణి వెంకట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు గ్రంథి రాజా, వెంకటరామారావు లతో కల్సి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయ వాడలో రోటరీ ఆధ్వర్యాన మహేష్ జాజూ ఐదేళ్ల క్రితం సామ్రాజ్య సిల్వర్ కింగ్ డమ్ ప్రారంభించి, విజయ వంతంగా నడిపిస్తున్నారని,రాజమండ్రిలో కూడా ఏర్పాటు చేయాలని భావించి సంప్రదించడంతో ఫ్రాంచైజీ ఇచ్చారని తీగల రాజా చెప్పారు. ధర్మబద్ధంగా అంత్యంత నాణ్యత ప్రమాణాలతో కూడిన కొత్త డిజైన్లతో సరసమైన ధరలకు వెండి వస్తువులు,గోల్డ్ ప్లేటెడ్ వెండి ఆభరణాలు ,గిఫ్ట్ ఆర్టికల్స్ అందిస్తామని ఆయన వివరించారు. ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 11.07నిలకు రోటరీ గవర్నర్ డా.ఎం.వెంకటేశ్వరరావు ప్రారంభిస్తారని తీగల రాజా చెప్పారు. 1905లో పాల్ హరీస్ అనే న్యాయవాది చికాగోలో ప్రారంభించిన రోటరీ సంస్థ దేశవిదేశాల్లో విస్తరిం చిందని, 1953లో అప్పటి జిల్లా జడ్జి డా రంగ రాజన్ సారధ్యంలో రాజమండ్రి రోటరీ క్లబ్ ప్రారంభమైందని,1998 -99లో రోటరీ సభ్యునిగా చేరిన తాను పట్టపగలు వెంకట్రావు సారధ్యంలో ఎన్నో పదవులు నిర్వహించి, సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచు కున్నానని వివరించారు. తరవాత రోటరీ రివర్ సిటీలో చేరారనని, 2022లో యువతను, సేవా భావం గల వ్యాపార వేత్తలతో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం



ఐకాన్స్ ప్రారంభించామని ఆయన తెలిపారు. విద్య, వైద్య, పర్యావరణ తదితర సేవా కార్యక్రమాల్లో ఐకాన్స్ చురుగ్గా పాల్గొనేలా చేయడంతో పాటు 70 -80 సంవత్సరాల వృక్షాలు నేలకూలితే మళ్ళీ బతికించే కార్యక్రమాన్ని అధునాతన టెక్నాలజీతో ప్రారంభించి ఇప్పటికే 19వృక్షాలను సురక్షిత ప్రాంతాల్లో నాటి, రక్షించామని, ఆయన తెలిపారు. దాదాపు 100మంది సభ్యులతో ఉన్న రోటరీ ఐకాన్స్ చేపట్టే కార్యక్రమాలు ఇంకా విరివిగా కొనసాగాలన్న సంకల్పంతో సామ్రాజ్య సిల్వర్ కింగ్ డమ్ ఫ్రాంచైజీ ప్రారంభించాలని నిర్ణయించిన వెంటనే సభ్యులు ఆనందంగా ముందుకు వచ్చారని, బయట నుంచి కొంటామని రావడంతో వారిని సభ్యులు చేర్చుకుని రాజమండ్రి ఐకాన్స్ వాణిజ్య ప్రయివేట్ లిమిటెడ్ గా ఏర్పడి ఈ వ్యాపారాన్ని ప్రారంభిస్తున్నామని తీగల రాజా తెలిపారు. 92. 5హాల్ మార్క్ వెండి వస్తువులు, గోల్డ్ ప్లేటెడ్ వెండి ఆభరణాలు, గిఫ్ట్ ఆర్టికల్స్ వంటివి అందిస్తామని తెలిపారు. వీలైనంత తక్కువ ధరకు వినియోగదారులకు అందించడం, వచ్చే లాభంలో కొంతమొత్తాన్ని రోటరీ ఐకాన్స్ సేవా కార్యక్రమాలు వెచ్చిస్తామని ఆయన చెప్పారు. నమ్మకానికి ప్రతీకగా సామ్రాజ్య సిల్వర్ కింగ్ డమ్ ఉంటుందని ఆయన చెప్పారు.

**ప్రారంభ అవర్స్ ....**

ఇమ్మణ్ణి వెంకట్ మాట్లాడుతూ ప్రస్తుతం బంగారం ధరలు ఎక్కువగా ఉండడం వలన వెండి వస్తువులకు గిరాకీ పెరిగిందని గుర్తుచేశారు. అందుకే నాణ్యమైన వెండి వస్తువుల్లను,గోల్డ్ ప్లేటెడ్ వస్తువులను అందించాలన్న సంకల్పంతో సేవా భావంతో సామ్రాజ్య సిల్వర్ కింగ్ డమ్ నెలకొల్పినట్లు ఆయన తెలిపారు. ప్రారంభ అఫర్ గా మూడురోజుల పాటు గోల్డ్ ప్లేటెడ్ వస్తువులపై 50శాతం



తగ్గింపు ఉంటుందని, 92.5హాల్ మార్క్ వెండి వస్తువులపై గ్రాముకి 5రూపాయలు తగ్గిస్తామని, వెండి పట్టీలపై తరుగు,మజూరీ ఉండదని తెలిపారు.మూడు రోజులపాటు అమ్మకాలపై లక్కీ డ్రా తీసి బాగుమతులు ఇస్తామని తెలపారు.అలాగే ప్రతి పదివేల రూపాయల కొనుగోలుకు ఒక కూపన్ ఇచ్చి, జనవరి 20న డ్రా తీసి, మొదటి బహుమతిగా వడ్డాణం, రెండవ బహుమతిగా నక్లెస్, మూడవ బహుమతిగా చెవిదుద్దులు ఇస్తామని తెలిపారు. వెంకటరామారావు మాట్లాడుతూ నకిలీ,మోసం పెరిగి పోతున్న నేపథ్యంలో నాణ్యమైన వస్తువులు నమ్మకంగా అందించడానికి సేవాభావంతో ఈ సంస్థను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మొదటి అంతస్తులో 92.5 హాల్ మార్క్ వెండి వస్తువులు,సెకండ్ ఫ్లోర్ లో గోల్డ్ ప్లేటెడ్ ఆభరణాలు, మూడవ ఫ్లోర్ వేడుకలకు అద్దెకివ్వడానికి కన్వెన్షన్ హాలుగా చేశామని ,నాల్గవ ఫ్లోర్ లో ఆఫీసు రూమ్ ఉందని ఆయన వివరించారు. గ్రంథి రాజా మాట్లాడుతూ ఇప్పటికే అందరూ వ్యాపారాలు చేస్తున్నవాళ్ళే రోటరీ ఐకాన్స్ లో ఉన్నప్పటికీ ప్రత్యేకంగా సేవాభావంతో ఈ సంస్థను నెలకొల్పుతున్నట్లు తెలిపారు.విజయవాడ నుంచి వచ్చి అనంత్ జాజూ మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులు అందిస్తూ ఖాతాదారుల్లో నమ్మకం కల్గిన తమ సంస్థ రాజమండ్రి ఫ్రాంచైజీ ఇస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు.సందీప్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**21న మిస్ రాజమండ్రి, మిసెస్ రాజమండ్రి**

కాగా 21వ తేదీ శనివారం సాయంత్రం 5గంటలకు స్థానిక శుభమస్తు ఫంక్షన్ హాలులో మిస్ రాజమండ్రి, మిసెస్ రాజమండ్రి పోటీలు నిర్వహిస్తున్నట్లు తీగల రాజా చెప్పారు. అంత్యంత వేడుకగా జరిగే ఈ గ్రాండ్ ఫినాలే లో ఎంపికైన మిస్ రాజమండ్రి, మిసెస్ రాజమండ్రి లను సామ్రాజ్య సిల్వర్ కింగ్ డమ్ కి ఏడాది పాటు బ్రాండ్ అంబాసిడర్ లుగా పెడతామని, తద్వారా లోకల్ టాలెంట్ ను వినిగిస్తామని ఆయన తెలిపారు.ఇప్పటికే పేద వర్గాలకు చెందిన యువతకు సామ్రాజ్య సిల్వర్ కింగ్ డమ్ లో ఉదోగాలు ఇచ్చామని ఆయన వివరించారు.

# భరత్ నువ్వు అవినీతి చక్రవర్తివి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
గత ప్రభుత్వంలోని గాలి ఎంపీ మార్గాని భరత్ రామ్ అవినీతి చక్రవర్తి గా పేరుగాంచారని తెలుగుదేశం పార్టీ రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్, ఉమా మార్కండేయ స్వామి ఆలయ మాజీ చైర్మన్ యిన్నమూరి దీపు ఆరోపించారు. ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి రాంబాబు మాట్లాడుతూ బీసీలను గౌరవించి కీలక పదవులు కట్టబెట్టేది తెలుగు దేశం పార్టీయేనని చెప్పారు. వైసీపీ పాలనలో 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి కనీసం కుర్చీలు, నిధులు కూడా లేకుండా చేశారని ఆయనవిమర్శించారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆనాడు బీసీ వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావును సిటీ కోఆర్డినేటర్ గా తప్పించారని,పాలిక శ్రీనుకు ఏ పదవి లేకుండా పక్కన పెట్టేశారని అప్పుడు వారు బీసీలని గుర్తుకు రాలేదా అని మండిపడ్డారు. కుడుపూడి సత్తిబాబును రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గా టీడీపీ నియమించిందని, ఇటీవల ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ఆత్మీయ సమావేశం నిర్వహించారని గుర్తు చేశారు. ఎన్నికల్లో 40 వేల మెజారిటీతో గెలవకపోతే రాజకీయాల్లో నుంచి తప్పుకుంటానని చెప్పిన భరత్ 73 వేల తేడాతో చిత్తుగా ఓడిపోయినా రాజకీయాల నుంచి ఇంకా ఎందుకు తప్పుకోలేదని మజ్జి రాంబాబు నిలదీశారు. బీసీవర్గానికి చెందిన చల్లా శంకర్రావును ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ గా చేసిన ఘనత టీడీపీదే అన్నారు. గతంలో ఇన్నీసుపేట బ్యాంకు చైర్మన్ గా కోళ్ళ బాబు సొంత ఇమేజ్ తో గెలిస్తే జగన్ దగ్గరకు తీసుకొని వెళ్ళి మనవల్లే గెలిచారని భరత్



- బీసీలను గౌరవించి పదవులు ఇచ్చింది టీడీపీయే
- వైసీపీ పాలనలో బీసీలకు కుర్చీలు-నిధులు లేని కార్పొరేషన్లు
- రౌతు ను కోఆర్డినేటర్ గా తప్పించిన భరత్
- మా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అభివృద్ధి సామ్రాట్
- వైసీపీ గాలి వీచినా 2019 లోనూ భరత్ కు రాజమండ్రి లో మెజారిటీ రాలేదు
- కావాలంటే మద్యం షాపు భరత్ కు ఇస్తాం
- భరత్ కార్పొరేటర్ గా కూడా గెలవలేడు
- మీడియాతో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, నక్కా దేవీ ప్రసాద్, యిన్నమూరి దీపు

గొప్పలు చెప్పుకున్నారు నుంచి ఎద్దేవా చేశారు. భాస్కర్ నగర్ సొసైటీ భూముల్లో జరిగిన అవకతవకలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సరిదిద్దుతున్నారని చెప్పారు. రాజకీయంగా తెరమరుగైన భరత్ తన ఉనికి కాపాడుకునేందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థలల్లో బీసీ రిజర్వేషన్లు 33 శాతం నుంచి జగన్ 23 శాతానికి తగ్గించారని , ఇదేనా వైసీపీకి బీసీల మీద ప్రేమ అని రాంబాబు ప్రశ్నించారు. బీసీలంతా టీడీపీ వెంట ఉన్నారని అందుకే భరత్ తో సహ ఆ పార్టీ వారంతా ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడిపోయారని తెలిపారు. నక్కా దేవీవరప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ హయాంలోను ఆరెండు ప్రభుత్వ మద్యం దుకాణాలు అక్కడే ఉన్నాయని మాజీ ఎంపీ భరత్ తెలుసుకోవాలని హితవు పలికారు.మద్యం షాపుల నుంచి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు రూ. 50 వేల వంతున ముడుపులు ఇస్తున్నట్లు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలా చెప్పిన సన్నాసి ఎవరని ప్రశ్నించారు. మద్యం దుకాణాలు ఆదాయం లేక బాధ పడుతున్నారు. భరత్ కు కావాలంటే మద్యం దుకాణం ఇప్పిస్తామని అన్నారు. ఇసుక నుంచి ముడుపులు ఆరోపణను కూడా నక్కా దేవీ ప్రసాద్ కొట్టిపారేశారు. రెండు ఈవీఎంలు పనిచేయక భరత్ 73 వేల తేడాతో ఓడిపోయారు. ఆ రెండు పని చేసిఉంటే 75 వేల ఓట్ల తేడాతో చిత్తుగా ఓడిపోయే వారని అన్నారు. యిన్నమూరి దీపు మాట్లాడుతూ తనపై భరత్ కార్పొరేటర్ గా పోటీ చేయాలని సవాలు చేశారు. అప్పుడు ఎవరు చోటా నాయకుడో తేలుతుందన్నారు. దేవీచౌక్ పుష్కర ఘాట్ నాసి రకం పనులు చూస్తేనే భరత్ చేసిన అభివృద్ధి ఎలాంటిదో అర్థమవుతుందన్నారు. 72 వేల ఓట్లకు పైగా తేడాతో ఓడిపోయిన భరత్ ఇంకా రాజకీయాల్లో ఉండడానికి సిగ్గులేదా అన్నారు. ఆదిరెడ్డి కుటుంబం మంచి తనం వల్ల నీ ఆటలు సాగుతున్నాయి. మేమయితే నిన్ను ఉపేక్షించమన్నారు. ఈ ఊరి నుంచి పంపించేస్తాం అని దీపు వ్యాఖ్యానించారు. ఇకనైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు ఉర్లంకల లోకేష్,పిల్లి శ్యామ్, పోలాకి పరమేష్, చాపల చిన్న రాజు, చింతపల్లి నాని,కంది కొండ అనంత్,బి శివారెడ్డి,కిలపర్తి నాగభూషణం పాల్గొన్నారు.

క్యాట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన

## ఆదిత్య విద్యార్థులు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐ.ఐ.యం) లో ఎం.బి.ఎ మరియు పి.జి.డి.యం అడ్మిషన్ కు నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్) -2024లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు రాజ్వీడ్ 96.84 మరియు చిప్పాడ వెంకటకేశవ. 88 పర్సంటేజ్ స్కోర్ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్ ఫణికుమార్ తెలియ జేశారు. విద్యార్థి



రాజ్వీడ్ మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం నుండి అర్థమెటిక్, రీజనింగ్ మరియు ఇంగ్లీషు బాషల మీద తర్ఫీదు ఇవ్వడం,క్యాట్ ప్రత్యేక శిక్షణ వల్ల 96.84 పర్సంటైల్ సాధ్యపడిందని, మాకు తర్ఫీదు ఇచ్చిన సి.ఆర్.టి డైరెక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నామని అన్నారు. విద్యార్థి చిప్పాడ వెంకట కేశవ నిరంతర శిక్షణ మరియు అభ్యాస్ పోర్టల్లో రోజు నిర్వహించిన క్యాట్ ప్రాక్టీసు టెస్టు ఎంతో ఉపయోగపడ్డాయని అన్నాడు. కళాశాల చైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డా.ఎన్. సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా.బి.వి.ఎల్ నాయుడు,డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డి,ఆదిత్య బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ, అధ్యాప కబృందం, అధ్యాపకేతర బృందం విద్యార్థులను అభినందించారు.

# సమస్యలను మార్గదర్శకాలతో పరిష్కరించండి : ఆర్డీవో కృష్ణ నాయక్

- అవసరమైతే రెవెన్యూ,పోలీసులు వెళ్ళండి

**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో సమస్యలను మార్గదర్శక లకు అనుగుణంగా పరిష్కరించాలని రాజమహేంద్ర వరం ఆర్డీవో కృష్ణ నాయక్ అన్నారు. శుక్రవారం శ్రీరంగపట్నంలో సర్పంచ్ మద్దాల పెద్దమ్మజీం మణ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన విచ్చేసి, రైతుల పలు సమస్యలకు సంతృప్తిగల సమాధానాలు ఇచ్చారు. కోరుకొండ నరసన్న భూములకు సంబంధించి కలెక్టర్, దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ చాలా గ్రామాల్లో రీసర్వేకు సంబంధించి కొద్దిమంది రైతుల భూములు 22ఏ క్రింద ఆన్లైన్లో చూపిస్తున్నాయని, రెవెన్యూ అధికారులు సంబంధిత రికార్డులను క్షుణంగా పరిశీలించి వారికి న్యాయం చేయాల న్నారు. మరికొద్ది మంది రైతులకు తమ భూముల్లో హెచ్చుతగ్గులు వచ్చాయని, రెవెన్యూ అధికారులు ఇరువురు రైతులను పిలిచి వారితో సామరస్యంగా మాట్లాడి హెచ్చుతగ్గులను సరి చేయాలన్నారు. లేనిపక్షంలో వారం, వారం



రోజుల వ్యవధిలో ఇరువురు రైతులకు నోటీసులు ఇచ్చి పరిష్కరించాలని, అవసరమైతే పోలీసులను వెంట తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించాల న్నారు. తమ రెవెన్యూ పరిధిలో ఇప్పటివరకు 534 అర్జీలు వచ్చాయని, వాటిని ఖచ్చితమైన మార్గదర్శకాలతో పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా రైతులకు సంబంధించి సుదీర్ఘ సమస్యలను రెవెన్యూ అధి కారులు పరిష్కరిస్తే వారిని అభినందిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సుస్వాగతం, రీ సర్వే డిటీ రజిని, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రామిరెడ్డి, సర్పంచ్ మద్దాల పెద్దమ్మజీ రమణ, తనకాల నాగేశ్వరరావు, బుద్ధ బాపూజీ, సూరిశెట్టి కుటుంబరావు, వీఆర్వో కర్రి రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ లెవెల్ టెస్ట్ లో ప్రతిభ కనబరిచిన

# సరస్వతి విద్యార్థులు :పెనకటి

కరస్పాండెంట్ గంగాధర్ అభినందనలు



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్ :**
కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ లో 9 మంది విద్యార్థిని, విద్యార్థులు నేషనల్ అనలైటికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (నాట్)కు సెలెక్ట్ అయ్యినట్లు కరెస్పాండంట్ పెనకటి గంగధర్ తెలిపారు. నిశాసంస్థ ప్రతీ ఏడాది దేశవ్యాప్తంగా స్కూల్స్ నందు ఆన్లైన్ పరిక్ష ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేసి,జిల్లా వ్యాప్తంగా ద్వితీయ రౌండ్ పరీక్షను నిర్వహించి, ఉత్తమ ప్రతి భను కనబరిచిన విద్యా ర్థిని విద్యార్థులకు దేశ రాజధానిలో అతిరధ మహారథుల సమక్షంలో బహు మతి ప్రధానం చేస్తారని తెలిపారు. ఈ ఏడాది 9 మంది ద్వితీయ రౌండ్ కు సెలెక్ట్ అవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంపికైన విద్యార్థిని విద్యార్థు లను కరెస్పాండంట్ పెనకటి గంగాధర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అను, ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి, ఉపాధ్యాయ సిబ్బంది విజేతలకు అభినందనలు తెలిపారు.

# విజ్ఞానంతోనే ఉన్నత శిఖరాలకు చేరుతాం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హితవు
లూథరన్ ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లు బహూకరణ

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
బాగా చదివి మన విజ్ఞానానికి... ప్రతిభను తోడు చేస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని రాజ మండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) హితవుపలికారు. స్థానిక జాంపేటలోని లూథరన్ ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలకు జనసేన పార్టీ నాయకులు సంగిత వీరబాబు సహకారంతో సమకూర్చిన రెండు కంప్యూటర్లను పాఠశాల యాజ మాన్యానికి, అలాగే ఒక వృద్ధురాలికి రూ.4వేలు పెన్షన్ ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ రాజమండ్రి ఇన్ఛార్జ్ అత్తి సత్యనారాయణ (అనుశ్రీ), అధ్యక్షులు వై శ్రీను, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీవరప్రసాద్ తదితరులతో కలిసి పాఠశాల యాజమాన్యానికి కంప్యూటర్లు అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆట పాటలతో పాటు చదువులో కూడా ప్రతిభ కనబరచాలన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక ప్రతిభను మెరుగుపరిచేందుకు కంప్యూటర్లు అందచేసిన వీరబాబు, విద్యార్థులకు డైనింగ్ హాల్ కోసం షెడ్డు నిర్మించేందుకు ముందుకు వచ్చిన దేవీచౌక్ సంఘం అధ్యక్షులు శ్రీను, పాఠశాలకు 400 పుస్తకాలు, పెన్నులు అందచేసిన మారిశెట్టి శ్యామ్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. అనుశ్రీ సత్యనారాయణ విద్యార్థులు ఉన్నత శిఖ



రాలకు చేరుకోవాలంటే వారికి క్రమశిక్షణతో ఉపా ధ్యాయులు విద్యాబుద్ధలు చెప్పాలన్నారు. అదే తరుణంలో విద్యార్థులు కూడా ఉపాధ్యాయులు బోధించే పాఠాలు శ్రద్ధగా విని జ్ఞానం పెంచు కోవాలని సూచించారు. వై శ్రీను మాట్లాడుతూ విద్యార్థులకు, పాఠశాలకు సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వచ్చిన దాతలను అభినందించారు. మరింతమంది దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతతకు సహకారం అందించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు చాపల చిన్నరాజు, నగర క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు సాల్మన్ రాజు, నాయకులు పిల్లి శ్యామ్, ఉర్లంకల లోకేష్, జమ్మి కృష్ణ, కందికొండ అనంత్, అనూప్ జైన్, బి శివారెడ్డి, షేక్ బషీర్, సలాది ఆనంద్, సరస్వతి, జాంపేట లూథరన్ ఎయిడెడ్ హై స్కూల్ కరెస్పాండంట్ ఎమ్. ఐజయ, హెడ్ మిస్ట్రెస్ ఎన్. మేరీ పెరల్స్, స్టాఫ్ సెక్రటరీ టి. మార్టిన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపు నిర్వాహకుల పై బైండోవర్



**అయినవిల్లి, విశ్వం వాయిస్ న్యూస్:**
ఇద్దరు బెల్ట్ షాపు నిర్వాహకులు పై బైండోవర్ కేసులు నమోదు చేశారు. సుంకర రామమూర్తి , క్రాపపాలెం గ్రామానికి చెందిన పాటి కనకం దాసు అను వ్యక్తులును బైండ్ అవుర్ చేసి అయినవిల్లి తహసిల్దారు వారి వద్ద హాజరు పరిచినట్టు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, అమలాపురం వి.టి.వి సత్యనారాయణ తెలిపారు బెల్ట్ షాపు నిర్వాహకుల ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున షూరిటీ విధించి విడుదల చేశారు.



### 5 ట్రాక్టర్లు గ్రామ పంచాయతీలకు అందచేసిన
## అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి

**పెదపూడి, విశ్వం వాయిస్ న్యూస్:**
పెదపూడి ఎంపీడీఓ కార్యాలయంలో పెదపూడి మండలం పెద్దాడ, వేంద్ర, గంద్రేడు, ఏపీ త్రయం, సంపర గ్రామాలకు "స్వచ్ఛా భారత్" కార్యక్రమంలో భాగంగా 30 లక్షల రూపాయలు విలువ కలిగిన 5 ట్రాక్టర్లు ఒక్కొక్క గ్రామానికి ఒక్కో ట్రాక్టర్ చొప్పున ఆయా గ్రామ పంచాయతీలకు అందచేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో పెదపూడి మండల NDA నాయకులు,పెదపూడి గ్రామ NDA నాయకులు,కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు



# వర్గీకరణ వలన పెను ప్రమాదం

**- ఎస్సీ రిజర్వేషన్లను 25శాతానికి పెంచాలి**
**- అప్పుడు శాస్త్రీయంగా వర్గీకరణ అంశం పరిశీలించాలి**
**- వన్ మ్యాన్ కమిషన్ చైర్మన్ కి ఉల్లం రవి వినతి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
ఎస్సీ రిజర్వేషన్లు ఎప్పటి నుంచి 15సాతంగానే ఉన్నాయని, అయితే జనాభా పెరిగిన నేపథ్యంలో 25శాతానికి రిజర్వేషన్లు పెంచి, ఆతరువాత వర్గీకరణ గురించి శాస్త్రీయంగా ఆలోచన చేయాలనీ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉల్లం రవి కోరారు. ఈమేరకు ఎస్సీ ఉప వర్గీకరణ మరియు అమలు కమిటీ వన్ మ్యాన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా కు ఆయన వినతిపత్రం సమర్పించారు. మాలమహానాడు జిల్లా ప్రెసిడెంట్ గారా త్రినాథ్,మాల మహానాడు రాజమండ్రి సిటీ ఆర్గన సెక్రెటరీ వల్లూరు రాజేష్, రూరల్ రాజమండ్రి ప్రెసిడెంట్ గాలి రాధాకృష్ణ(బుజ్జి),రూరల్ అధ్యక్షులు నేతల కిషోర్ ఆయన వెంట ఉన్నారు. వర్గీకరణ అంశం 30ఏళ్లుగా చూస్తూనే ఉన్నామని, ఇది కేవలం పార్లమెంట్ కి సంబంధించిన అంశమని, ఆర్టికల్ 341కి సంబంధించినదని , ఈ ఆర్టికల్ ప్రకారం ఏదైనా కులాన్ని గానీ, కుల సమూహాలను గానీ చేర్చడానికి, తొలగించడానికి వీలుందని, అయితే విడదీయడానికి అని మాత్రం లేదని ఆయన పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఇదే చెప్పిందని, మళ్ళీ 30ఏళ్ల తర్వాత ఇదే సుప్రీం కోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్లపై ఆధారపడి జీవించే కులాలను విడదీయడం వలన సదరు కులాలుం ప్రమాదంలో పడ తాయని, దాడులకు గురై అంతరించే ప్రమాదం ఉందని ఉల్లం రవి పేర్కొన్నారు. అందుకే వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టంచేసారు. ముందు రిజర్వేషన్లను 25శాతానికి పెంచి అప్పుడు వర్గీకరణ గురించి శాస్త్రీయంగా ఆలోచన చేయాలనీ ఉల్లం రవి కోరారు.

# ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలని రాజమండ్రి ఎమ్మార్పీఎస్, సీనియర్ నాయకులు తుత్తరపూడి రమణ మాదిగ విజ్ఞప్తి చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అభిప్రాయ సేకరణ నిమిత్తం వన్ మాన్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా రాజమండ్రి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తుత్తరపూడి రమణ మాదిగ బోయినపల్లి కరుణాకర్ మాదిగ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఉమ్మడి రాష్ట్రం నుండి ప్రత్యేక ఆంధ్ర వరకు ఉమ్మిడి ఎస్సీ రిజిర్వేషన్లను ఎ.బి.సి.డి లుగా వర్గీకరించాలని మాదిగ సామాజిక వర్గం మాన్యశ్రీ మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో వివిధ రూపాలలో పోరాటం చేస్తుందని తెలిపారు. కాబట్టి ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర వ్యాప్తంగా రాష్టాని యూనిట్ గా అమలు చేయాలని కోరారు. అదే నిష్పత్తి ప్రకారం జిల్లా జోనల్ ప్రత్యేక రిక్రూట్మెంట్ లలో అమలు చేయాలని సూచించారు. విద్య, ఉద్యోగ రంగాలతో పాటు సంక్షేమ, అభివృద్ధి రంగాలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక రంగం ఏపీఐఐసీ భూములు,ప్లాట్ల కేటాయింపులో, పారిశ్రామిక పథకాలలోను, ఎస్.సి.లకు ఎ.బి.సి.డి.లుగా సబ్సిడీ లలోను అమలు చేయాలన్నారు. బడ్జెట్ పెట్టేటపుడే సబ్ ప్లాన్ నిధులతోనే వర్గీకరణ ప్రకారం నిధులు విభజించి, ఆయా కులాలకు కేటాయించి అమలు చేయాలని కోరారు. ఎస్సీలను ఏ బి సి డి లుగా విభజించాలని ప్రస్తుత ఆంధ్ర రాష్ట్రంలో ఎస్సీలు ప్రభుత్వ లెక్కల ప్రకారం 18 % ఉన్నట్టుగా లెక్కలు చెబుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రం విడిపోయాక ఆ లెక్కల ప్రకారం ఎస్సీ జనాభా 18% పెరిగిందని వివరించారు. గత ప్రభుత్వం చేసిన సకలజనుల సర్వేలో స్పష్టంగా ఉందని కాబట్టి రిజర్వేషన్ శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రంలో ఒక్కరు ఇద్దరు మాత్రమే మాదిగ ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నారు. ప్రత్యేక సివిల్స్ సర్వీస్ శిక్షణ సంస్థలు, 26 జిల్లాలో ఏర్పాటు చేయాలని కోరారు. వర్గీకరణ రిజర్వేషన్లు అమలు కోసం కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు, రాజమండ్రి ఎంపీ పురంధరేశ్వరి లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ జె ఎస్ సి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కొడమంచుల రమణ మాదిగ, కొత్తపల్లి కొమ్ము సత్తిబాబు మాదిగ,పల్లేటి శ్రీనివాసు మాదిగ, నేకూరి రవికుమార్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్య నిర్వహణ ఎలా జరుగుతుందో అనే విషయంపై
## ఆంధ్ర ప్రదేశ్ స్వచాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ బృందం పర్యటన







**పూణే:** దేశంలోనీ ప్రముఖ రాష్ట్రాలలో పరిశుభ్రంగా ఉన్న నగరాలలో పారిశుధ్య నిర్వహణ ఎలా జరుగుతుందో అనే విషయంపై అవగాహన పెంచుకుని అక్కడ అవలంభిస్తున్న కార్యాచరణ నీ మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో కూడా తీసుకు రావాలనే ముఖ్య ఉద్దేశంతో ఆంధ్ర ప్రదేశ్ స్వచాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆయన సభ్యుల బృందం గత కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా పర్యటనలు కొనసాగిస్తున్నారు..ఇందులో భాగంగా మహారాష్ట్ర లోని పూణే నగరం లో అవలంభిస్తున్న ఒక వినూత్న పద్ధతి గురించి తెలుసుకున్న పట్టాభిరాం సభ్యుల బృందం ఈ రోజు అక్కడ పర్యటించింది... పూణే నగనరం లో ర్యాగ్ పికర్స్ (చెత్త ఏరుకునే వారు) గా ఉన్న 8 వేల మంది కలిపి ఒక కోపరేటీవ్ సొసైటీనీ ఏర్పాటు చేసుకుని దానికి "స్వచ్ కోపరేటీవ్ సొసైటీ"అని పేరు పెట్టుకుని ఇంటి ఇంటికి తిరిగి తడి చెత్తని,పొడి చెత్తని సేకరిస్తున్నారని, అలా వచ్చిన తడి చెత్తని, పొడి చెత్తనీ వేరు చేసి దానిని ట్రాన్స్ఫర్ స్టేషన్స్ కి తరలించి అక్కడి నుంచి ప్రాసెసింగ్ యూనిట్స్ కి పంపించడం ఒక ప్రక్రియగా సాగుతుందని తెలిపారు.. అయితే ఇందులో పొడి చెత్త ద్వారా వచ్చిన ప్లాస్టిక్ కవర్స్,వాటర్ బాటిల్స్,పెట్ బాటిల్స్ తదితర రిసైకిలాబుల్స్ వారు ఏర్పాటు చేసుకున్న స్వచ్ కోపరేటీవ్ సొసైటీ ద్వారా అమ్ముకుని నెలకి 25 వేల రూపాయలకి పైగా సంపాదిస్తున్నారని,ఇది చాలా గొప్ప విషయమని పట్టాభి తెలిపారు.. ర్యాగ్ పికర్స్ స్వచ్ కోపరేటీవ్ సొసైటీ డైరెక్టర్ గా ఉన్న విద్యావతి బృందం దగ్గరుండి మరీ తడి చెత్తని,పొడి చెత్తని సేకరించే విదానాన్ని పట్టాభిరామ్ బృందానికి చూపించడం అలాగే దాని ద్వారా వచ్చే కోపరేటీవ్ సభ్యులకి వచ్చే ఆదాయ మార్గాల గురించి వివరించడం జరిగిందని పట్టాభి తెలిపారు.

. ఇలా కొత్తగా అవలంభిస్తున్న ఈ కార్యక్రమానికి పూణే లో ఉన్న ఎన్జీవో లు కూడా సహకారం అందిస్తున్నారని పట్టాభి తెలిపారు..

ఈ ర్యాగ్ పికర్ (చెత్త ఏరుకునే వారి) లో దాదాపు ఎక్కువమంది మహిళలే ఉన్నారని పట్టాభి తెలిపారు..మన రాష్ట్రం లో మహిళలు ఆర్థికంగా ఎదగ దానికి 25 ఏళ్ల క్రితమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా గ్రూప్స్ తీసుకు వచ్చారని పట్టాభి గుర్తు చేశారు.. పూణే నగరంలో అనుసరిస్తున్న ఈ నూతన పద్ధతి కచ్చితంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి కూడా ఉపయో గపడుతుందని, ఇక్కడ జరుగుతున్న విధానాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కి వివరించి అవసరం అయితే స్వచ్ కోపరేటీవ్ సొసైటీ బృందాన్ని ఆంధ్ర రాష్ట్రానికి రప్పించి స్వయంగా వారు నడుపుతున్న స్వచ్ కోపరేటీవ్ సొసైటీ గురించి ప్రెజెంటేషన్ తీసుకుంటామని ఇది కచ్చితంగా రాష్ట్రానికి మేలు చేస్తుందని దీని పై త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో చర్చించి తగిన మార్గ దర్శకాలు రూపొందిస్తామని పట్టాభి తెలిపారు..

### ఆరెస్సెస్ నేతల లక్ష్యంగా దాడులకు ప్లాన్ చేసిన
## ఇస్లామిక్ ఉగ్రవాదుల అరెస్ట్



ఆరెస్సెస్, ఇతర హిందూ ధర్మ సంస్థల గ్రూపులే లక్ష్యంగా దాడులకు ప్లాన్ చేసిన అనుమానిత ఇస్లామిక్ ఉగ్రవాదులను అసోం ఏటీఎస్ అరెస్ట్ చేసింది. కేరళ, బెంగాల్, అసోంలో ఏటీఎస్ పోలీసులు ఏక కాలంలో రెండు రోజుల పాటు దాడులు నిర్వహించారు.ఈ ఆపరేషన్ కి "ప్రఘట్" అని పేరు పెట్టారు.

ఈ సందర్భంగా ఎనిమిది మంది ఇస్లామిక్ ఉగ్రవాదులను అరెస్ట్ చేశారు. కేరళలో అరెస్టైన వారిలో అల్ ఖైదా అనుబంధంగా వున్న ఇస్లామిక్ ఉగ్రవాది ఎండీ సాద్ రాడి అకా ఎండీ షాబ్ సేఖ్ వున్నాడు. ఇక.. మినారుల్ షేక్, ఎండీ అబ్బాస్ అలీ, నూర్ ఇస్లాం మండల్, అబ్దుల్ కరీం మండల్, ముజీబర్ రెహ్మాన్, హమీదుల్ ఇస్లాం, ఇనాముల్ హక్ గా గుర్తించామని ఏటీఎస్ పేర్కొంది. దేశంలో మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టి, మత సామరస్యానికి భంగం కలిగించాలని చూస్తున్నారని అసోం స్పెషల్ డీజీపీ హర్మీత్ సింగ్ తెలిపారు. వీరి నుంచి కొన్ని కీలక పత్రాలు, వస్తువులను కూడా పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. వీరు కేరళ, బెంగాల్లో నివసిస్తున్న ఈ ఉగ్రవాదులు అల్ఖైదా ఉగ్రవాదులతో సంబంధాలు కలిగి ఉన్న మహ్మద్ ఫర్హాన్ ఇస్రాక్ కోసం పని చేస్తున్నట్లు తాము గుర్తించామని ఏటీఎస్ తెలిపింది.

# ఇంటికి వచ్చిన పార్శిల్‌లో డెడ్ బాడీ...
## భయాందోళనకు గురైన స్థానికులు

**ఉండి మండలంలోని మహిళకు పార్సిల్‌లో గుర్తు తెలియని మృతదేహం**
**ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ**
**కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



**పశ్చిమ గోదావరి, విశ్వం వాయిస్ న్యూస్:**
పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఓ మహిళకు పార్సిల్‌లో డెడ్ బాడి (మృతదేహం) రావడం తీవ్ర కలకలాన్ని రేపింది. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగంటి గ్రామంలోని ఒక మహిళకు పార్శిల్‌లో మృతదేహం వచ్చింది. దానిలో ఓ బెదిరింపు లేఖ ఉంది. ఈ ఘటన ఆమెతో పాటు స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. జిల్లా ఎస్పీ నయూం అస్మి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విషయంలోకి వెళితే.. గ్రామానికి చెందిన సాగి తులసి అనే మహిళకు జగనన్న కాలనీలో స్థలం మంజూరు కాగా ఇల్లు నిర్మిస్తోంది. ప్రస్తుతం ఆ ఇల్లు ప్లాస్టింగ్ స్టేజ్‌లో ఉంది. ఈ క్రమంలో ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం కోసం క్షత్రియ సేవా సమితిని ఆశ్రయించింది. ఆమెకు సదరు సేవా సమితి మొదటి విడతలో టైల్స్ పంపించింది. మరోసారి ఆర్థిక సాయం కోసం మహిళ దరఖాస్తు చేసుకోగా, పార్శిల్‌లో విద్యుత్ సామగ్రి వస్తుందని భావించింది. అయితే, తాజాగా వచ్చిన పార్శిల్‌లో విద్యుత్ సామాగ్రికి బదులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వచ్చింది. పార్శిల్‌లో ఒక ఉత్తరం కూడా ఉన్నట్లు గుర్తించారు. అందులో రూ.1.30 కోట్లు చెల్లించాలి. లేకపోతే ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొని ఉంది. దీంతో ఆ మహిళ కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామానికి చేరుకుని పరిశీలించారు.


పార్శిల్ పెట్టెలో సుమారు 45 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సగ భాగం ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అర్ధాకలితో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులు అర్ధాకలితో బతుకీడుస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాలలో 199 మంది కార్మికులు సేవలందిస్తున్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 2024 ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అనేక హామీలు గుప్పించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని ఇంజినీరింగ్ విభాగం కార్మికులు ఎపి మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న సమ్మె చేపట్టారు. 10 రోజుల అనంతరం చర్చలకు పిలిచిన ఉన్నతాధికారులు నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో 19వ తేదీ నుంచి తాత్కాలికంగా వాయిదా వేశారు. ప్రస్తుత ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. కార్మికుల సమ్మెపై ఉక్కుపాదం కార్మికుల సమ్మెపై ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపడం పలు విమర్శలకు దారి తీసింది. ఈ నెల 9వ తేదీ తొలి రోజు మున్సిపల్ కార్యాలయం గేటు పక్కన కార్మికులు ఆందోళన చేశారు. పోలీసు అనుమతులు లేవని తేల్చిచెప్పటంతో తప్పనిసరి పరిస్థితులో ఎదురుగా గల అన్న క్యాంటీన్ వద్ద నిరసన తెలుపుతున్నారు. బరకాలతో టెంటు ఏర్పాటు చేసుకుని ఆందోళనలను కొనసాగించారు. అయితే సాయంత్రం 5 గంటల తర్వాత ఎవరూ ఉండకూ దదని పోలీసులు హెచ్చరించడంతో టెంటును సైతం తొలగించడం పాలనా యంత్రాంగం తీరుకు దర్పణం పట్టింది. రాష్ట్ర స్థాయిలో ఉద్యమించడంతో ఉన్నతాధకారులు ఈ నెల 17న ఎట్టకేలకు అమరావతిలోని ఉన్నతాధికారులు చర్చలకు పిలవడంతో కార్మికులు తమ డిమాండ్‌లను విన్నవించారు. కార్మికుల డిమాండ్‌లను తెలుసుకన్న ఉన్నతాధికారులు నెల రోజుల వ్యవధి కావాలని, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామనటంతో కార్మికులు సమ్మెను తాత్కాలిక వాయిదా వేశారు. అయితే నెల రోజులలో పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తా మంటూ స్పష్టం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 199 మంది కార్మికులు రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరే షన్‌లో 180 మంది, కొవ్వూరు మున్సి పాలిటీలో 13 మంది, నిడదవోలు మున్సిపాలిటీలో ఆరుగురు చొప్పున ఇంజినీరింగ్ వర్కర్లు పని చేస్తున్నారు. వీరంతా కార్పొరేషన్, మున్సిపాలిటీలలో వీధిలైట్లు, తాగునీటి కుళాయిలు, పార్కులలో విధులు నిర్వ హిస్తారు. చెత్త ట్రాక్టర్లు, లారీలు నడిపే డ్రైవర్లుగ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫిట్టర్‌లుగా పని చేస్తున్నారు.

### మాజీ సీఎం జగన్ దాఖలు చేసినపిటిషన్‌పై
## విచారణను జనవరి 9కి వాయి దా




**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్**
మంత్రి పొంగూరు నారాయణ తనపై వేసిన పరువునష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ సీఎం జగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు జనవరి 9కి వాయి దా వేసింది. బుధవారం ఈ వ్యాజ్యం విచారణకురాగా నారాయణ తరపున న్యాయవాది గింజుపల్లి సుబ్బారావు వాదనలు వినిపించారు. కౌంటర్ వేసేందుకు మరింత సమయం ఇవ్వాలని, పిటిషనర్, సాక్షి పత్రికకు సంబంధాలు ఉన్నాయని నిరూపించేందుకు ఆధారాలను కోర్టు ముందు ఉంచుతామని తెలిపారు. జగన్ తరఫు న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. తమ వ్యాజ్యంపై అత్యవసరంగా విచారించాలని కోరారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను జనవరి 9కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## ఇన్‌స్టాగ్రామ్ ఫోటోల గురించి మాట్లాడిన వైష్ణవి అంధలే



వైష్ణవి అందాల ఇటీవలి ఫోటోలు ఖచ్చితంగా ఎక్కువగా మాట్లాడే చిత్రాలు. ఆమె చలనచిత్రాలలో తన శక్తివంతమైన నటనకు కూడా ప్రసిద్ధి చెందింది. ఆమె మహారాష్ట్రలోని ముంబైలో జన్మించింది. వైష్ణవి ఫుల్రాణి (2023), వాకింగ్ టాకింగ్ స్ట్రాబెర్రీ ఐస్‌క్రీమ్ మరియు యే దిల్ కిత్నీ బార్ సంఝాయేగా (2023) తో సహా పలు ప్రాజెక్ట్‌లలో కనిపించింది. ఆమె పనికి ప్రేక్షకుల నుండి ప్రశంసలు లభిస్తున్నాయి. ఫూల్రాణి 2023లో విడుదలైన రొమాంటిక్ చిత్రం. ఇది మరాఠీ భాషలో ఉంది మరియు దాని ప్రత్యేక కథాంశంతో ఆసక్తిని రేకెత్తించింది. ఈ చిత్రానికి సహ రచయిత మరియు దర్శకత్వం విశ్వాస్ జోషి. ఇందులో ప్రముఖ నటులు సుబోధ్ భావే మరియు ప్రియదర్శిని ఇందాల్కర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఫుల్రాణి మార్చి 22, 2023న థియేటర్లలో విడుదలైంది. ఈ చిత్ర నిర్మాణాన్ని అమృతా ఫిల్మ్స్, థర్డ్ ఏస్ ఎంటర్‌టైన్‌మెంట్ మరియు ఫిన్‌క్రాఫ్ట్ మీడియా నిర్మించాయి. వయాకామ్ 18 స్టూడియోస్ దాని పంపిణీని నిర్వహించింది. వైష్ణవి తన స్టైలిష్ సమిష్టిలో నటించిన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌ను షేర్ చేసింది. ఆమె లేత రంగు బ్లేజర్‌తో మ్యాచింగ్ ప్యాంటు ధరించింది. లుక్ ఆమె సొగసైన శైలిని హైలైట్ చేసింది. తన క్యాప్షన్‌లో, ఆమె ఫోటోగ్రాఫర్ గోహిల్ జీత్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, తాను జరా ధరించినట్లు పేర్కొంది.

సినీ వాయిస్ CINEMA

### సూపర్ స్టార్ సినిమాలో
## మిస్టర్ పర్ఫెక్ట్ నిస్ట్ న్యూ లుక్ !


సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో కూలీ భారీ అంచనాల మధ్య తెరకెక్కు తోన్న భారీ సంగతి తెలిసిందే. స్టార్ హీరోలు కింగ్ నాగార్జున, శాండిల్ వుడ్ స్టార్ ఉపేంద్ర లు కీలక పాత్రలు పోషి స్తున్నారు. ఈ నయా స్టార్ల ఎంట్రీతో సినిమాపై అంచనాలు రెట్టింపు అవుతున్నాయి. ఇదే చిత్రంలో బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ నిస్ట్ అమీర్ ఖాన్ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు అనే ప్రచారం చాలా కాలంగా జరుగుతోంది. కానీ ఇంత వరకూ ఖరారైంది లేదు. దీంతో ఇది కేవలం ప్రచారమనుకున్నారంతా. తాజాగా అమీర్ ఖాన్ నేరుగా కూలీ సెట్స్ నుంచి అభిమానుల్ని సర్ ప్రైజ్ చేసారు. దీంతో సినిమాలో అమీర్ లుక్ ఎలా ఉంటుందన్నది కూడా తెలిసిపోయింది. డిఫరెంట్ లుక్ లో అమీర్ ఆకట్టుకుంటున్నారు. గెడ్డం...మెలి తిరిగిన కోర మీసాలు.. ముందు భాగంలో కాస్త నెరిసిన తల తో అమీర్ ఫ్రెష్ లుక్ ఇంట్రెస్టింగ్. కళ్లకు గ్లాసెస్ ధరించారు. పెదాలపై సన్నని నవ్వు చూడొచ్చు. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. అమీర్ ఖాన్ నటిస్తున్నారంటే సినిమాలో ఆయన పాత్ర చాలా కీలకమైందిగా తెలుస్తుంది. ఇంత వరకూ ఆయన సౌత్ సినిమాల్లో నటించలేదు. తొలిసారి రజనీకాంత్- లోకేష్ కనగరాజ్ పిలుపు మేరకు నో చెప్పకుండా



ముందుకొస్తున్నారు. అమీర్ ఎంట్రీతో సినిమా కి మార్కెట్ పరంగా మరింత కలిసొస్తుంది. రజనీకాంత్- అమీర్ ఖాన్ లకు ఇండియాలోనే కాక వివిధ దేశాల్లోనే మంచి మార్కెట్ ఉంది. అలాంటిదిప్పుడు ఇద్దరు కలిసి నటించడంతో ప్రపంచ దేశాల మార్కెట్ పైనే గురి పెట్టినట్లు కనిపిస్తుంది. అమీర్ ఖాన్ ఎంత పెద్ద స్టార్ అయినా ఎంతో డౌన్ టౌ ఎర్త్. సౌత్ లో స్టార్ హీరోలందరి తోనూ ఆయనకు మంచి స్నేహం ఉంది. చిరంజీవి, నాగార్జునలతో మరింత క్లోజ్ గా ఉంటారు. అవకాశం వస్తే వాళ్ల సినిమాల్లో సైతం నటిస్తా నని చాలా సందర్భాల్లో అన్నారు. ఇటీవలే మెగాస్టార్ చిరంజీవి గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డుకి ఎక్కగానే...ఆ గౌరవాన్ని అమీర్ ఖాన్ చేతులు మీదుగా అందుకున్న సంగతి తెలిసిందే.

## 'తెలివైనోళ్లైతే థియేటర్ నుంచి వెళ్లిపోండి'

కన్నడ నటుడు కమ్ దర్శకుడు ఉపేంద్రకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఆయన సినిమాలంటే అంటే చాలు.. అంతా భారీ అంచనాలు పెట్టుకుంటారు. ఉపేంద్ర తీసిన చిత్రాలు.. ఇప్పటికీ ఎవర్ గ్రీన్ గానే ఉంటాయి. ఆడియన్స్ ను తెగ అలరిస్తాయి. అలా తెలుగులో కూడా ఆయన స్పెషల్ ఫ్యాన్ బేస్ ను క్రియేట్ చేసుకున్నారు. ఇప్పుడు చాలా గ్యాప్ తర్వాత యూఐ మూవీతో నేడు థియేటర్లలోకి వచ్చారు ఉపేంద్ర. డిఫరెంట్ కాన్సెప్ట్ తో యూఐ సినిమా తెరకెక్కించినట్లు రిలీజ్ కు ముందు మేకర్స్ విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ ద్వారా ఫుల్ క్లారిటీ వచ్చేసింది. టీజర్, ట్రైలర్‌ను చూస్తే.. యూఐ మూవీ ఊహించని స్టోరీతో రూపొందినట్లు క్లియర్ గా అర్థమైపోయింది. దీంతో సినిమాపై ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో మేకర్స్ కూడా క్రేజీ ప్రమోషన్స్ చేపట్టారు. తొలిసారి ఉపేంద్ర పాన్ ఇండియా మూవీలో నటించగా.. అందుకు తగ్గట్లే సినిమాను ప్రమోట్ చేశారు. ముఖ్యంగా కన్నడతో పాటు తెలుగులో తమ ప్రమోషన్స్ ద్వారా సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేశారు. ఇప్పుడు సినిమా థియేటర్లలో రిలీజ్ అయ్యాక.. అనేక మంది నెటిజన్లు సోషల్ మీడియాలో రివ్యూస్ ఇస్తున్నారు. ఉపేంద్ర వన్ మ్యాన్ షో చూపించారని ప్రశంసిస్తున్నారు. డైరెక్టర్ గా కూడా తన డిఫరెంట్ మేకింగ్‌తో అదరగొట్టారని అంటున్నారు. వింటేజ్ ఉపేంద్రను మళ్లీ చాలా గ్యాప్ తర్వాత చూశామని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. దాంతో పాటు థియేటర్‌లో స్క్రీన్ పై వచ్చిన ఫస్ట్ డిస్క్లైమర్ కోసం నెట్టింట పోస్టులు పెడుతున్నారు. 'మీరు ఇంటెలిజెంట్ అనుకుంటే.. వెంటనే థియేటర్ నుంచి బయటకు వెళ్లండి' అంటూ డిస్క్లైమర్ వేశారు ఉపేంద్ర. దీంతో అది చూసి థియేటర్లలో ఒక్కసారిగా షాకయ్యామని, ఉపేంద్ర మాస్ అలా ఉంటుందని చెబుతున్నారు.





---

### గ్రామంలో అన్నింటికి
## ప్రాధాన్యత ఇవ్వాలి
### ఎంపీపీ నౌడు వెంకటరమణ



రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్: గ్రామంలో అన్నిటికి ప్రాధాన్యత ఇవ్వాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాయవరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ విస్తారణ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిపిడిపి,బిపిడిపి శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ నౌడు వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలంటే సానిటేషన్, త్రాగునీరు ఉండాలని ఆయన అన్నారు. ఈఓపియర్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వుందన్నారు. ఇందుకు అనుగుణంగా ఆయా పంచాయితీ సర్పంచ్ లు ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పంచాయితీలకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ జి సత్యనారాయణ రాజు, డిపిఆర్సి ఎస్ ఎన్ వి భీమేశ్వరి, ఆర్డబ్ల్యూఎస్ జేఈ చైతన్య కుమారి, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




### బలహీనంగా ఉన్న పంట కాలువల ఏటి గట్లు,
## డ్రైనేజీ గట్ల స్థితిగతులను పరిశీలించండి
### జిల్లా కలెక్టర్ అర్.మహేష్‌కుమార్

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం డిసెంబర్ 20: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పంట కాలువలు, డ్రైనేజీలలో గుర్రపు డెక్క పూడికతీత, కాలువగట్లను మట్టితో బలోపేతం చేసే పనులను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టేందుకు వివిధ పనుల జాబితాను శాఖల సమన్వయంతో రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జలవనరుల శాఖ, డ్రైనేజీ విభాగం ఇంజనీర్లు మరియు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులతో సమావేశం నిర్వహించి కాలువలు డ్రైనేజీల పూడికతీత గట్లు బలోపేతానికై చేపట్టాల్సిన పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ అనుసంధానంతో పంట కాలువలు డ్రైనేజీల గట్లు మట్టితో బలోపేతం చేసేందుకు, మూడు విభాగాలు అధికారులు ముందుగా బలహీనంగా ఉన్న పంట కాలువల ఏటి గట్లు, డ్రైనేజీ గట్ల స్థితిగతులను పరిశీలించి కార్యాచరణను రూపొందించాలన్నారు. కూనవరం నుండి రామేశ్వరం మొగ వరకు ఉన్న ముంపు స్వాంప్ (మడుగు) ముంపు నివారణకై తిరుపతి జిల్లా పులికాట్ సరస్సు మాదిరిగా పూడికతీత డ్రెజ్జింగ్ పనుల నిర్వహణకై తిరుపతి నుండి నివేదికను రప్పించి ఆ మాదిరిగా పనులు చేపట్టేందుకై చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. అదేవిధంగా ఇప్పటికీ నోటిఫికేషన్ చేయని డ్రైనేజీలను నోటిఫై చేసేందుకు గల విధివిధానాలను సమీకరించి ఆ ప్రకారం చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషా%శీ%తి వారికి ఆయన సూచించారు. అదేవిధంగా



గోదావరి ఏటిగట్టు మరియు పంట కాలువలు డ్రైనేజీ కాలువలు జియో టెక్స్ టైల్ విధానం ఆచరణ, పచ్చిక లేయర్లుతో బలోపేతం చేసేందుకు గల సాధ్య సాధ్యాలను అధ్యయనం చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాలువలు మూసివేసే సమయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఇప్పటి నుండే అంచనాల రూపకల్పన చేసి నిధులు మంజూరు కొరకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. నీటి తీరువా పన్నులు వసూళ్ల ఆధారంగానే అభివృద్ధి పనులకు నిధులు సమకూరతాయని ఆయన తెలిపారు. చిన్న పాటి పంట బోదెలలో పూడికతీత పనులు మండలాల పరిధిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులే నరేగా అనుసంధానంతో చేపట్టడం జరుగుతోదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాతి, డ్వామా పథక సంచాలకులు ఎస్ మధుసూదన్, గోదావరి హెడ్ వర్క్స్ కె.కాశీ విశ్వేశ్వరరావు, డ్రైనేజీ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంవివి కిషోర్, జల వనరుల శాఖ ఈఈ బి.శ్రీనివాస రావు, జలవనరులు డ్రైనేజీ విభాగం ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## మసీదు ఇమామ్‌లకు గౌరవ వేతనం పట్ల హర్షం
### టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్

**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** నెలకు రూ.5 వేలు కంటే తక్కువ ఆదాయం ఉన్న మసీదు ఇమాములు, మౌజన్‌లకు గౌరవ వేతనాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపట్ల టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి మైనార్టీ సంక్షేమశాఖ ఉత్తర్వులు విడుదల చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 5 వేల



మసీదుల్లో ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేలు గౌరవ వేతనం చెల్లించడం కొనసాగుతుందని తెలిపారు.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ చెల్లింపు అమలు చేస్తారన్నారు. ఇందుకు ఏడాదికి రూ.90 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. జి వో విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ధన్యవాదాలు తెలిపారు.

### ప్రధమ స్థానం కైవసం చేసుకున్న
## గొడారిగుంట హైస్కూల్
### విద్యార్ధులను అభినందించిన జిల్లా కలెక్టర్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐ ఐ ఎస్ ఎఫ్ )2024 హేకతాన్ సైన్స్ ప్రాజెక్ట్ కంపిటీషన్ లో ఆంధ్రప్రదేశ్ కి చెందిన కాకినాడ జిల్లా, మదర్ థెరిసా మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, జాతీయ స్థాయిలో ప్రధమ స్థానం పొందిన సందర్భంగా విద్యార్థులను, సైన్స్ టీచర్ కే ఆర్ ఎస్ చంద్రారెడ్డి ని అభినందించిన కాకినాడ జిల్లా కలెక్టరు షాన్ మోహన్ సగిలి తొలుత ఈ పోటీకి ఎంపికైన 7000 ప్రాజెక్ట్స్ దరఖాస్తులు పరిశీలించి 117ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక చేశారని, వీటిలో ం2 కేటగిరీ లో ఆంధ్రప్రదేశ్ కి చెందిన కాకినాడ మదర్ తెరిస్సా పాఠశాల ప్రథమ స్థానం కైవసం చేసుకుని, క్యాష్‌ప్రైజ్ మనీ 30,000 గెలుచుకుందని ఎంపికైన ప్రాజెక్టులు మినిస్ట్రీ ఆఫ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కి పంపుతారని దీనిపై మరింత పరిశోధనజరుగుతుందని చంద్రారెడ్డి తెలియజేసారు. ఈ బహుమతులు అస్సాం సైన్స్ & టెక్నాలజీ మినిస్టర్, మరియు ఇస్రో చైర్మన్ సోమనాథ్, సి ఎస్ ఐ ఆర్ డైరెక్టర్ ఎన్.కలై సెల్వి చేతుల మీదుగా ఐఐటీ గౌహతి(అస్సాం) లో నవంబర్ 30,డిసెంబర్ 23 (3రోజులు)జరిగిన కార్యక్రమంలో అందుకున్నట్లు మెంటార్ గా వ్యవహరించిన సైన్స్ టీచర్ కడింశెట్టి రామ సూర్యచంద్రారెడ్డి తెలియజేసారు ఈ ప్రాజెక్ట్ వర్క్ ప్రెసెంట్ చేసిన విద్యార్థులు గేదెల బిందు(టీం లీడర్), ఆరెళ్ల దీపిక, ఆనల ప్రవల్లికతో పాటు ఇన్స్పైర్ నేషనల్ 2023 ఢిల్లీ కి ఎంపికైన గుత్తుల అనుష్కను, మెంటార్ గా వ్యవహరించిన చంద్రరెడ్డిని కాకినాడ జిల్లా కలెక్టర్ అభినందించారు గోడారిగుంట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికి మా పాఠశాల విద్యార్థులు స్టేట్ లెవెల్‌కి 11 పర్యాయాలు, జాతీయ స్థాయికి 3 పర్యాయాలు సైన్సు పోటీలలో ధీటుగా నిలబడి విజేతలుగా నిలిచారని గైడ్ టీచర్ చంద్రారెడ్డికృషిని అభినందించారు ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై శ్రీనివాసు, మాథ్స్ స్కూల్ అసిస్టెంట్ సిహెచ్ వి రమణ పాల్గొన్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by **KHANDAVELLI SUNIL KUMAR,** H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: **KHANDAVELLI SUNIL KUMAR.** RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com